
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

3

గురువారం 23 జనవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 16.4

నిధులున్నా.. బకాయి చెల్లించరా?



● విద్యుత్ సర్వీసులపై ట్రాన్స్‌కో, మునిసిపల్ వర్గాల మధ్య అభిప్రాయభేదాలు

ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్టాంప్ డ్యూటీ నిధులను ప్రభుత్వం ఇటీవల మునిసిపాలిటీలకు మంజూరు చేసింది. ఆ నిధులతో మునిసిపల్ సాధారణ నిధి ఖాతాలు గలగలమంటున్నాయి. అయితే స్టాంప్ డ్యూటీ విడుదల సమయంలోనే విద్యుత్ బకాయిలు, కార్మికుల పీఎఫ్, జీఎస్టీ తదితర ప్రభుత్వ సంస్థల చెల్లింపులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని కమిషనర్లను మునిసిపల్ పరిపాలనా విభాగం ఆదేశించింది. మునిసిపల్ ఖాతాల్లో నిధులు జమయి సుమారు 20 రోజులకు పైగా గడుస్తున్నా మునిసిపాలిటీలు మాత్రం విద్యుత్ బిల్లులను చెల్లించకపోగా పీఎఫ్, జీఎస్టీ చెల్లింపుల మాటే మునిసిపల్ అధికారులు మరిచినట్లుగా ఉన్నట్లు ప్రచారమవుతోంది.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

ఏళ్ల తరబడి విద్యుత్ బిల్లులకోసం ఎదురు చూస్తున్న ట్రాన్స్‌కో అధికారులు బకాయి బిల్లుల వసూళ్లకోసం మునిసిపాలిటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆరు మునిసిపాలిటీలకు స్టాంప్ డ్యూటీ నిధులు రూ.48,65,88,110 కాగా విద్యుత్ బిల్లులు రూ.14,17,13,751 చెల్లించాల్సి ఉంది. జిల్లాలోని ఆరు మునిసిపాలిటీల్లో 908 విద్యుత్ కనెక్షన్లుండగా పెండింగ్ బిల్లులు రూ.14,17,13,751 ఉన్నాయి. వీటిలో వీధి దీపాల కనెక్షన్లు 546కు బకాయి బిల్లు రూ.4,16,26,266 ఉండగా, నీటి సరఫరా కనెక్షన్లు 362 ఉండగా బకాయి బిల్లులు రూ.10,00,87,485 ఉన్నాయి. అయితే విద్యుత్ మీటర్లు లేని కనెక్షన్లు మరిన్ని ఉన్నాయని ట్రాన్స్‌కో సిబ్బంది పేర్కొంటుండగా మునిసిపల్ యంత్రాంగాలు మాత్రం వినియోగంలో, గుర్తు తెలియని సర్వీసుల పేరిట విద్యుత్ బిల్లులను వసూలు చేస్తున్నారని అంటున్నారు. ఇందుకు నెలవారీ విద్యుత్ బిల్లులో భారీగా తేడాలు వస్తుండడటమే ఉదాహరణ అని అంటున్నారు.

జాయింట్ సర్వే చేద్దామని..

విద్యుత్ సర్వీసులు, కనెక్షన్లు, మీటర్లపై జాయింట్ సర్వే చేద్దామని పలుమార్లు కోరినప్పటికీ ట్రాన్స్‌కో సిబ్బంది సహకరించడం లేదని కూడా మునిసిపల్ అధికారులు అంటున్నారు. అయితే విద్యుత్ బిల్లులన్నీ సక్రమంగానే ఉన్నాయని, వినియోగం మేరకే చార్జీలు వస్తాయని ట్రాన్స్‌కో సిబ్బంది పేర్కొంటున్నారు. దీంతో ఇరు ప్రభుత్వ శాఖల మధ్య బిల్లులు, చెల్లింపులపై విభేదాలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు పెండింగ్ బిల్లులను చెల్లించాల్సిందేనని ట్రాన్స్‌కో అధికారులు స్పష్టం చేస్తున్నారు.

నిధులున్నా చెల్లింపులో ఆలస్యం

ఖజానా నిండా నిధులున్నప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లింపులో మునిసిపల్ అధికారులు ఆలస్యం చేస్తున్నారని ట్రాన్స్‌కో సిబ్బంది అంటున్నారు. నిధుల లేమి కారణంగా ఏళ్ల తరబడిగా బిల్లులను చెల్లించకున్నా ప్రజా అవసరాల దృష్ట్యా డిస్‌కనెక్షన్‌కు ప్రయత్నం చేయలేదని, కేవలం నోటీసుల వరకే పరిమితమయ్యామని ట్రాన్స్‌కో అధికారులు..

మిగతా 4వ పేజీలో..



మహాధర్నా



● షరతులతో అనుమతించిన హైకోర్టు
● ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వేడెక్కిన రాజకీయం
● విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పట్టు

నల్లగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రైతాంగ సమస్యలపై బీఆర్ఎస్ నిర్వహించతలపెట్టిన మహాధర్నాకు హైకోర్టు అనుమతించింది. ఈ నెల 28న నల్లగొండలోని గడియారం చౌరస్తాలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మహాధర్నా నిర్వహించుకోవాలని హైకోర్టు సూచించింది. ఈ మేరకు హైకోర్టు బుధవారం తీర్పునిచ్చింది. నల్లగొండలో నిర్వహించతలపెట్టిన బీఆర్ఎస్ మహాధర్నా ఇప్పటికే రెండు పర్యాయాలు వాయిదాపడింది. ఈ నెల 12న నిర్వహించాల్సిన మహాధర్నాను సంక్రాంతి పండుగ నేపథ్యంలో వాయిదా వేయగా, 21న నిర్వహించాల్సిన ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. గ్రామసభల నిర్వహణ నేపథ్యంలో బీఆర్ఎస్ ధర్నాకు రక్షణ కల్పించలేమనే కారణంతో పోలీసులు అనుమతి నిరాకరించారు. కాంగ్రెస్ నేతల ఒత్తిళ్ల మేరకే మహాధర్నాకు అనుమతివ్వడం లేదని ఆరోపించిన బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మంగళవారం బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల నడుమ మున్సిపల్ కార్యాలయం వద్ద ఘర్షణ, వాగ్వాదం, పూలకుండీలు విసురుకోవడం వంటి ఘటనలతో ఉద్రిక్తత నెలకొంది. ఈ పరిస్థితుల్లో తాజాగా హైకోర్టు అనుమతివ్వడంతో ఈ నెల 28న మహాధర్నాను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ నాయకత్వం సిద్ధమైంది.

ఉమ్మడి జిల్లాలో రాజకీయ వేడి

ఈ నెల21న నిర్వహించాల్సిన బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నడుమ పొలిటికల్ వార్ మొదలైంది. కాంగ్రెస్ నేతల ఒత్తిళ్లతోనే పోలీసులు అనుమతి నిరాకరించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అదేవిధంగా ఫ్లెక్సీలు, కటౌట్ల తొలగింపు అంశంపై ఈ నెల 21వ తేదీన మునిసిపల్ కార్యాలయం కేంద్రంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నడుమ ఘర్షణ, మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డిని, బీఆర్ఎస్

మిగతా 4వ పేజీలో..

అర్హులందరూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

● జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల ఎంపిక కోసం నిర్వహించే గ్రామ సభలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని అప్పాజిపేట్, బుద్ధారం గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హుల పేర్లు జాబితాలో లేకుంటే ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, తిరిగి దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ఆర్టిజన్ల జేఏసీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సలీం పాషా అన్నారు. నల్లగొండ పట్టణంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద టీవీఏసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఆర్టిజన్ల రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కన్వర్షన్ చేస్తామని చెప్పి కాలయాపన చేసిందన్నారు. ఈ ప్రభుత్వం కూడా అదే తీరుతో ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హత కలిగిన వారిని కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెరిక శేఖర్, రమేష్, లింగస్వామి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎంజీయూ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ ఫలితాలను వీసీ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు.



4

అర్హుల జాబితాపై అపోహలొద్దు

● అది దరఖాస్తుదారుల జాబితా మాత్రమే ● అదే తుది మంజూరు లబ్ధిదారుల జాబితా కాదు
● జాబితాలో అనర్హులుంటే తొలగిస్తాం ● రాని వారు దరఖాసు చేసుకోవచ్చు ● కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎమ్మెల్యే వేముల వీరేశం



నార్కట్‌పల్లిలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, చిత్రంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు, ఇందిరమ్మఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతు భరోసాలైన నాలుగు సంక్షేమ పథకాల్లో అర్హుల గుర్తింపుకోసం విడుదలైన జాబితాపై అపోహలొద్దని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. అది వివిధ మార్గాల ద్వారా సంక్షేమ పథకాలు కోరుతూ చేసుకున్న దరఖాస్తుదారుల జాబితా మాత్రమేనని ప్రకటించారు. ఆ జాబితాలో కూడా ఎవరైనా అనర్హులుంటే వారిని తొలగిస్తామని చెప్పారు. నార్కట్‌పల్లి గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నిన్న 237గ్రామసభలు, 48 వార్డుసభలు జరిగాయన్నారు. గ్రామసభల ద్వారా సమాచారం సేకరించి అర్హుల తుది జాబితా తయారు చేస్తామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామన్నారు. రేషన్‌కార్డులతోపాటు ఇతర మూడు సంక్షేమ పథకాల కోసం సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న దానిని నమ్మవద్దన్నారు. అధికారికంగా ఇప్పటివరకు జాబితాలోని ఏ ఒక్కరికీ రేషన్‌కార్డు కాని, ఇతర సంక్షేమ పథకాలు కాని ఇవ్వలేదన్నారు. రేషన్‌కార్డు దరఖాస్తు నిరంతర ప్రక్రియన్నారు. ఎపుడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల మంజూరులో మహిళలకు పెద్దపీటవేయడంపై ఓ మహిళగా తనకు ఆనందానిచ్చిందన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం..ప్రజా పాలనలో పేదలకు అన్యాయం జరగదన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వచ్చేలా చేసే బాధ్యత తనదన్నారు. ప్రభుత్వం విడతల వారిగా అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే.ఉమేశ్ చారి, మార్కెట్ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, సీపీఐ నాయకుడు లొడంగి శ్రవణ్‌కుమార్, దూదిమెట్ల సత్తయ్య, స్రవంతి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, నట్టు సత్తయ్య, జెరిపోతుల భరత్, పుల్లెంల అచ్చాలు, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రెండోరోజు ఇలా...

గ్రామసభలు	:	221
వార్డుసభలు	:	47

దరఖాస్తులు ఇలా...

ఆత్మీయ భరోసా	:	446
రేషన్‌కార్డు	:	13,921
ఇందిరమ్మ ఇళ్లు	:	12,227

లబ్ధిదారుల జాబితా ఖరారు కాలేదు

చిట్యాల: రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం గ్రామ, వార్డుసభలలో చదువుతున్న పేర్లు కేవలం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లేనని కలెక్టర్ ఇలాత్రిపాఠి తెలిపారు. చిట్యాల 5వ వార్డులో జరిగిన వార్డు సభలో ఆమె ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ, వార్డు సభల్లో చదివే పేర్లలో పేరు లేకపోతే తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కమిషనర్ వీరేందర్, మండల ప్రత్యేకాధికారి శ్రవణ్, కౌన్సిలర్లు జడల పూలమ్మ చినమల్లయ్య, బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, పాటి మాధవరెడ్డి, ఎద్దులపురి కృష్ణ, గుండెబోయిన సైదులు పాల్గొన్నారు.

బోగస్ జాబితాలను నమ్మవద్దు: కలెక్టర్

నల్లగొండ: ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా వంటి పథకాలపై అనుమతి పొందిన లబ్ధిదారుల జాబితాల పేరుతో సామాజిక మాధ్యమాలు, గ్రామాల్లో విడుదల చేస్తున్న బోగస్ జాబితాలను ఎవ్వరు నమ్మవద్దని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. ప్రభుత్వం తరఫున ఇప్పటివరకు ఎలాంటి అనుమతి పొందిన జాబితాలను విడుదల చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ, వార్డు సభల్లో ఆయా పథకాల కింద ఇంతకు ముందు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను మాత్రమే చదువుతున్నారని చెప్పారు. ప్రజలు ఎవ్వరుకూడా ప్రచారాలు నమ్మవద్దన్నారు.

రాజకీయాలకతీతంగా యాదగిరిగుట్ట ఆలయాన్ని

అభివృద్ధి చేయాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

భువనగిరి అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి జరగాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి స్వాతి నక్షత్రం రోజున జరిగిన గిరిప్రదక్షిణలో ఆమె పాల్గొని మాట్లాడారు. పంచారూపాల్లో పూజలు అందుకుంటున్న స్వామివారిని దర్శించుకోవడం జన్మజన్మల పుణ్యఫలమన్నారు. ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలికి వేదాశీర్వచనం చేయగా ఆలయ ఈవో భాస్కర్ రావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతి నెల జరిగే గిరిప్రదక్షిణలో పాల్గొనడం అదృష్టమన్నారు. ఈ దివ్య క్షేత్రంలో పంచనారసింహుడి రూపాల్లో స్వామివారిని భక్తులు ఆరాధించడం ఎంతో విశేషమన్నారు. ఇంత భారీ ఆలయాన్ని నిర్మించేందుకు కేసీఆర్‌కు సంకల్ప శక్తిని ప్రసాదించడం తెలంగాణ ప్రజల అదృష్టమన్నారు. తెలంగాణలో ఏకైక గిరిప్రదక్షిణ చేసే అవకాశం ఉన్న క్షేత్రమని, గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు మెట్ల దారి వెంట నడిచి వెళ్లి ఆలయంలోని స్వామిఅమ్మవార్లను దర్శించుకోవాలన్నారు.

కొంపెల్లి పెద్ద చెరువు మరమ్మతుకు చర్యలు

● చెరువును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

మునుగోడు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి గ్రామంలో పెద్ద చెరువు మరమ్మతుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కొన్ని సంవత్సరాల నుంచి పైన ఉన్న గ్రామాలనుంచి నీళ్లు రాకపోవడంతో, కొంపల్లి ప్రజలు పడుతున్న ఇబ్బందిని రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వెదిరే విజేందర్‌రెడ్డి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను కొంపల్లి చెరువు క్షేత్రస్థాయి పర్యటనకు పంపారు. వెదిరే విజేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈఈలు సంపత్‌రెడ్డి, గోపి, లష్కర్, అంజయ్యల సమక్షంలో పుట్టపాక నుంచి కొంపల్లి వరకు ఫీడర్ కాల్వ పూడిక తీయడం, కాల్వ మీద కల్వర్టుల నిర్మాణం, చెరువు పూడిక తీయడం, చెరువులో ఉన్న కంపచెట్లను తొలగించడం గురించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు నూర శంకరయ్య, జీడిమండ్ల మల్లయ్య, సంకు శంకర్, బొల్లేపల్లి సాయిలు, నాంపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

● భూపాల్‌రెడ్డి ఇప్పటికైనా భాష మార్చుకోవాలి
● కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న గుమ్మల మోహన్‌రెడ్డి, చిత్రంలో బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

4

ధర్నా అంటే ఉలిక్కిపడుతున్న మంత్రులు

● కాంగ్రెస్ తీరును ప్రజలు గమనిస్తున్నారు ● ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోతోంది
● నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ ఫలితాలను ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కళాశాలలదే అన్నారు. డిగ్రీ కళాశాలలో విద్య సౌకర్యాలు మెరుగుపర్చి హాజరు నిబంధనను విధిగా పాటించాలన్నారు. సీవో డాక్టర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ మొదటి సెమిస్టర్ 6300మంది విద్యార్థులకు గాను 1338మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, మూడవ సెమిస్టర్‌లో 4509 మందికి 1569మంది, ఐదవ సెమిస్టర్‌లో 5378కి గాను 2380 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, అడిషనల్ కంట్రోలర్ లక్ష్మిప్రభ, సంధ్యారాణి, రామచంద్ర గౌడ్, ప్రవళిక, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయికి బానిసలై దొంగతనాలు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించడంతో పాటు గంజాయికి బానిసలుగా మారి ద్విచక్ర వాహనాలు దొంగతనాలు చేస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ కె.శివరాంరెడ్డి బుధవారం కేసు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన లింగగళ్ల పూర్ణచంద్, అదే ప్రాంతానికి చెందిన హరిజన్ మహేష్, నల్లగొండ పట్టణంలోని బీటీఎస్‌కు చెందిన కానుకుంట్ల జగదీష్ గంజాయికి బానిసలు అయి బైకులు దొంగతనాలు చేస్తున్నారు. వీరి వద్ద నుంచి రూ.35వేల విలువైన ఒక 1.600 కిలోల గంజాయితో పాటు ఒక బైకును స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 4గంటల సమయంలో నల్లగొండ వన్‌టౌన్ ఎస్‌ఐ ఆధ్వర్యంలో మిర్యాలగూడ రోడ్డులో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా డీఈవో ఆఫీస్ వైపు నుంచి ముగ్గురు ఒకే బైక్‌పై వస్తూ అనుమానాస్పదంగా కన్పించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. సులబంగా డబ్బులు సంపాదించడానికి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకొని హైదరాబాద్ బాల్‌నగర్‌లో రెండు కిలోల గంజాయి కొనుగోలు చేసి కొంత వారు ఉపయోగించుకొని మిగిలిన గంజాయిని ఈనెల 16వ తేదీన వెంట తీసుకొని వెళ్తూ కలెక్టర్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. నిందితుల నుంచి 1.600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో పకడ్బందీగా వ్యవహరించి నిందితులను అరెస్టు చేసిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, వన్‌టౌన్ ఎస్‌ఐ సైదులు, సిబ్బంది కృష్ణానాయక్, ఇంద్రారెడ్డి, శ్రీకాంత్, షకీల్, మధుసూదన్‌రెడ్డి, కిరణ్ కుమార్‌లను ఎస్పీ అభినందించారని తెలిపారు.

రేషన్ బియ్యం తరలిస్తుండగా..

తిరుమలగిరి(సాగర్), జనవరి 22(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని డీసీఎంలో తరలించబోతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్లతండా గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగుండ్లతండాకు చెందిన రేషన్‌డీలర్ ఆంగోతు రుక్మ కుమారుడు ఆంగోతు శంకర్ బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో రేషన్ షాపు గోదాము వద్ద డీసీఎంలోకి సుమారు 43క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లోడ్ చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా పోలీసులకు తెలిసింది. ఎస్‌ఐతోపాటు పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకోగానే ఆంగోతు శంకర్, డీసీఎం డ్రైవర్ నాగార్జున పరారయ్యారు. దీంతో అక్కడే బియ్యాన్ని లోడ్ చేసేందుకు వచ్చిన కూలీని ప్రశ్నించగా కల్వకుర్తికి చెందిన డీసీఎంలో బియ్యాన్ని లోడ్ చేయాలని చెప్తే వచ్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఎస్‌ఐ వీరశేఖర్ సీఐ బీసన్నకు తెలిపారు. ఆయన సంఘటనా స్థలానికి వచ్చి గోదాముకు వచ్చి సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో సివిల్‌సప్లయ్ డీటీ ముక్తార్, ఆర్‌ఐ లక్ష్మీకాంత్ స్టాక్‌ను పరిశీలించి గోదాములో ఉండాల్సిన దాని కంటే ఎక్కువ స్టాక్ ఉన్నట్లు నిర్ధారించి 43క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. చిలకాపురం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ వెంకట్రామ్‌కు అప్పగించారు. అదేవిధంగా ఏపీ24టీసీ 5214 నెంబరు గల డీసీఎం వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ సిబ్బంది సేవలు అభినందనీయం



సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం జాన్‌రెడ్డి

దేవరకొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ డిపో ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషితో పండుగలకు ఆదాయం రాష్ట్ర, జిల్లా స్థాయిలో అగ్రభాగాన నిలపడం అభినందనీయమని ఆర్టీసీ నల్లగొండ రీజనల్ మేనేజర్ జాన్‌రెడ్డి అన్నారు. దేవరకొండ డిపోలో బుధవారం నిర్వహించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసపత్రాలు, ప్రోత్సహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఇదే స్ఫూర్తితో డిపోను రాష్ట్రంలోనే అగ్రభాగాన నిలిపేందుకు కార్మికులు, ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవరకొండ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు ఉన్నారు.

చికిత్సపొందుతూ మాజీ సర్పంచ్ మృతి

● ఉప్పలంచలో హత్యాయత్నం



మల్లయ్య (ఫైల్)

శాలిగౌరారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఉప్పలంచ గ్రామంలో మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో తీవ్రంగా గాయపడిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండారు మల్లయ్య(53) మృతిచెందారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడి బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. మల్లయ్యకు భార్య, ఒక కూతురు ఉంది. మల్లయ్య మృతితో ఉప్పలంచ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మల్లయ్యపై దాడి చేసిన సంఘటనలో అనుమానితులు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. వారిని అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు సమాచారం. మల్లయ్య హత్య నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు ఉప్పలంచ గ్రామానికి ముందస్తుగా బలగాలను మోహరించారు. .

ఉర్సుకు వేళాయె..

● నేటినుంచి మూడురోజుల పాటు జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



విద్యుత్ దీపాల వెలుగులో జాన్‌పహాడ్ దర్గా

పాలకవీడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. మూడురోజుల పాటు నిర్వహించే ఉర్సుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. దర్గా పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

ఉర్సుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రాత్రిపూట నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేందుకు ట్రాన్స్‌కో అధికారులు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. సాంకేతిక లోపం ఏర్పడితే అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లతో పాటు సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

శాఖల వారీగా సేవలు

శాఖల వారీగా ప్రత్యేక స్టాల్స్, కౌంటర్లు ఏర్పాటు చేశారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆర్టీసీ సంస్థ సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ నుంచి ప్రత్యేక బస్సులు నడుపనుంది. భక్తులకు నిరంతరాయంగా దక్కన్ సిమెంటు ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు దక్కన్ సీజీఎం నాగమల్లేశ్వరావు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకున్నామని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

నిరంతరాయంగా తాగునీటి సరఫరా

నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు దక్కన్ సిమెంట్ యాజమాన్యం ముందుకొచ్చింది. ముందు రోజు నుంచే ప్లాస్టిక్ డ్రమ్ములు దర్గా పరిసరాల్లో పలుచోట్ల ఏర్పాటు చేసి వాటి మీద తెల్లని వస్త్రాలు కప్పి, వచ్చే భక్తులకు మంచి నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దుమ్ము లేవకుండా రహదారులపై నిరంతరం నీరు చల్లించనున్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు

పరిసరాల్లో రెండు చోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు కావాల్సిన మందులు సరఫరా చేయనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌ను కూడా సిద్ధం చేశారు. 20తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దక్కన్‌సిమెంట్ యాజమాన్యం సహకారంతో వీటి పనులు వేగవంతం చేస్తున్నారు. దర్గా పరిసరాల్లో పంచాయతీరాజ్ సిబ్బంది బ్లీచింగ్ చల్లుతున్నారు. అంటువ్యాధులు సోకకుండా చర్యలు తీసుకుంటున్నారు.

వక్ఫ్‌బోర్డు అధికారుల్లో మార్పు వచ్చేనా?

ప్రతి ఏటా కోట్లాదిరూపాయల కాంట్రాక్టులు వక్ఫ్‌బోర్డుకు వస్తున్నా దర్గా అభివృద్ధికి ఖర్చు చేయక పోవడంతో భక్తులు ప్రతి ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉర్సు సమయంలో ఏదో ఒక సారి సమావేశం నిర్వహించి ఉర్సుకు అంతో ఇంతో ఇచ్చి మమ అనిపించి చేతులు దులుపుకుంటున్నారు. ఆదాయం ఉన్నా శాశ్వత నిర్మాణాలు, టాయిలెట్లు, స్నానపు గదుల నిర్మాణం, తాగునీటి సరఫరా వంటివి చేపట్టక పోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ సంవత్సరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ముందుగానే స్పందించిన వక్ఫ్‌బోర్డు రూ.30లక్షల చెక్కును ఉర్సు నిర్వహణకు ఇచ్చింది.

ఉర్సు పనులు పరిశీలించిన ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

పార్కింగ్, హెలీప్యాడ్, సెక్యూరిటీ పనులను సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం పరిశీలించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాన్‌పహాడ్ దర్గా విశిష్టతను డీఎస్పీ శ్రీధర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వీఐపీల వాహనాలను మాత్రమే లోపలికి అనుమతించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రైవేట్ వాహనాలను లోపలికి అనుమతించకుండా పార్కింగ్ స్థలాల్లోనే నిలిపివేయాలని సూచించారు. ఆయన వెంట సీఐ చరమందరాజు, ఎస్బీ సీఐ నాగభూషణం, ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తదితరులు ఉన్నారు.



పార్కింగ్ పనులు పరిశీలిస్తున్న సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

550 మంది పోలీసులతో బందోబస్తు

ఉర్సులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. డీఎస్పీతోపాటు ఎనిమిది మంది సీఐలు, 28 మంది ఎస్‌ఐలు, నాలుగు స్పెషల్ ఫోర్స్ బృందాలు, 550 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేరేడుచర్ల వైపు 10ఎకరాల్లో, దామరచర్ల వైపు రెండు చోట్ల 15 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. పార్కింగ్ స్థలాల్లోనే ప్రైవేట్ వాహనాలను నిలిపివేయాలని, బారీకేడ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. గంధం ఊరేగింపు రోజు ద్విచక్ర వాహనాలను కూడా అనుమతించబోమన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వీఐపీలను మాత్రమే అనుమతించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసపిల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూపాల్‌రెడ్డి ఇప్పటికైనా భాష మార్చుకోవాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం చెబుతామన్నారు. ప్రతిపక్ష పార్టీలు ధర్నాలు, నిరసనలు ప్రజాస్వామ్య పద్ధతిలో చేయాలని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా మారకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో భూపాల్‌రెడ్డి కనీసం కౌన్సిలర్‌గా కూడా గెలవలేరని, ఆయన వల్ల బీఆర్‌ఎస్ పార్టీ పరువు పోతుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇప్పటికైనా కంచర్లను ఇన్‌చార్జి పదవి నుంచి తొలగిస్తేనే పార్టీ కొంతమేరకైనా ఉంటుందని, లేకపోతే గల్లీ పార్టీగా మారుతుందన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాదిరిగానే భూపాల్‌రెడ్డి గొడవలు సృష్టిస్తే బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్ష పదవి దక్కుతుందని ఆశిస్తున్నారని, ఆయనకు ఆ పదవి ఇస్తే పార్టీ ఊడ్చుకపోతుందని ఎద్దేవా చేశారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే తగిన గుణపాఠం చెబుతామని, అభివృద్ధికి కోమటిరెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు. భూపాల్‌రెడ్డి వెంట గుండాలు, రౌడీలు, గంజాయి బ్యాచ్ ఉంటుందని వారిని వెంట వేసుకునే దౌర్జన్యాలకు పాల్పడతారన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, బషిరోద్దీన్, పాశం సంపత్ రెడ్డి, మారగోని నవీన్ గౌడ్, కేసాని వేణుగోపాల్ రెడ్డి, జూలకంటి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా అంటే ఉలిక్కిపడుతున్న మంత్రులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే భగత్

నల్లగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొనే రైతు మహాధర్నా అంటేనే మంత్రులు ఉలిక్కి పడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ ధర్నా గురించి చెప్పిన నాటినుంచి అనేక ఆటంకాలను కల్పిస్తున్నారని, జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగిన పరిణామాలు కాంగ్రెస్ వ్యవహరించిన తీరు ప్రజలు గమనిస్తున్నారన్నారు. హైకోర్టులో తమకు అనుకూలంగా తీర్పు రావడం సంతోషకరమని, ఈ నెల 28న నల్లగొండలో జరిగే ఉమ్మడి జిల్లా రైతు మహాధర్నాకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ, వార్డుల సభల్లో గొడవలు జరుగుతున్నాయని, ప్రజలకు ఏ మాత్రం నమ్మకం లేదని ప్రజల విశ్వాసాన్ని ప్రభుత్వం కోల్పోయిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, కూలీలకు రూ.12వేలు, రైతుభరోసా, రేషన్ కార్డులు ఇస్తారో లేదోనన్న ఆందోళన ఏర్పడిందన్నారు. రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వంపై పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్, రాజీవ్ సాగర్, దూదిమెట్ల బాలరాజుయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. సమావేశంలో పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కొండూరు సత్యనారాయణ, తుమ్మల లింగస్వామి, నాగార్జున ఉన్నారు. నల్లగొండలో కేటీఆర్ పాల్గొనే మహాధర్నాకు అనేక ఆటంకాలు కల్పిస్తున్న అధికార పార్టీకి బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టు లాంటిందని బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిధులున్నా.. బకాయి చెల్లించరా?

(3వ పేజీ తరువాయి..)

అంటున్నారు. అయితే రోజువారి పని ఒత్తిడికి అదనంగా ప్రజాపాలన వార్డు సభల కారణంగా బిల్లుల చెల్లింపులో ఆలస్యం నెలకొందని, త్వరలోనే బిల్లులను జీరో చేస్తామని మునిసిపల్ అధికారులు అంటున్నారు. అయితే బిల్లుల వసూలులో నెలకొన్న జాప్యంపై ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే మునిసిపల్ ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లేందుకు వెనుకాడబోమని ట్రాన్స్‌కో అధికారులు అంటున్నారు.


మునిసిపాలిటీ	విద్యుత్ కనెక్షన్లు	బకాయి	స్టాంప్ డ్యూటీ నిధులు
చౌటుప్పల్	190	రూ.4,09,17,301	రూ.11,96,89,758
పోచంపల్లి	111	రూ.3,01,99,763	రూ.4,07,43,250
యాదగిరిగుట్ట	88	రూ.2,74,59,639	రూ.3,10,91,810
భువనగిరి	318	రూ.1,61,48,361	రూ.24,39,60,215
ఆలేరు	111	రూ.1,55,12,955	రూ.3,58,45,763
మోత్కూరు	90	రూ.1,14,75,732	రూ.1,52,57,314
మొత్తం	908	రూ.14,17,13,751	రూ.48,65,88,110

28న బీఆర్‌ఎస్ మహాధర్నా

(3వ పేజీ తరువాయి)



నాయకులను పోలీసులు బలవంతంగా తరలించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులపై మునిసిపల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, టూటౌన్ పోలీసులు, మునిసిపల్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిపై మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. మాజీమంత్రి జగదీష్‌రెడ్డి మంగళవారం రాత్రి నల్లగొండకు చేరుకొని భూపాల్‌రెడ్డికి సంఘీభావం ప్రకటించడంతోపాటు, కాంగ్రెస్ నేతలపైనా, ప్రభుత్వంపైనా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనపై దాడికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవారం నల్లగొండ ఎస్పీకి సైతం ఫిర్యాదు చేశారు. బుధవారం కూడా ఇరుపార్టీల నేతలు పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలతో సోషల్‌మీడియాలో హల్‌చల్ సృష్టించారు. ఈ నేపథ్యంలోనే తిరిగి 28వ తేదీన మహాధర్నాకు హైకోర్టు అనుమతిస్తూ బుధవారం సాయంత్రానికి ఆదేశాలు రావడంతో రాబోయే అయిదురోజులపాటు ఉమ్మడి జిల్లాలో రాజకీయ హడావిడి కొనసాగనుంది.



ఉదయం 8 గంటల సమయంలో కోదాడ జాతీయ రహదారిని కప్పేసిన మంచు దుప్పటి

సూర్యాపేటలో పొగమంచులో వెళ్తున్న వాహనాలు

అర్వపల్లిలో..

● కొమ్మ కొమ్మకూ కొంగలు



చివ్వెంల మండలం ఖాసింపుర గ్రామ చెరువులో ఎండిన చెట్ల కొమ్మలపై వాలిన కొంగలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాలను బుధవారం మంచు దుప్పటి కప్పేసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 9:30గంటల వరకు మంచు కురుస్తూనే ఉంది. దీంతో రహదారులు కనిపించలేదు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ఇబ్బంది పడ్డారు. వాహనాల హెడ్ లైట్ల వెలుతురుతో వాహనాలు నడిపారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలకేంద్రం నుంచి ఖాసింపేట గ్రామానికి వెళ్తున్న రహదారి పక్కన ఉన్న ఊరచెరువులో ఎండిన చెట్ల కొమ్మ, కొమ్మలపై వాలిన తెల్లని కొంగలు ఆకట్టుకున్నాయి.

●ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్ వర్క్



సూర్యాపేట ఎస్వీ కళాశాల మైదానాన్ని కప్పేసిన మంచు



హుజూర్‌నగర్‌లో ఇంటిని కప్పేసిన మంచు

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	558.30
టీఎంసీలు	228.4419
ఎడమకాల్వకు నీటి విడుదల	7,353
కుడికాల్వకు	9,567
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	0000
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	280 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	19,600 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	40.86 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	2000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	640.56 అడుగులు
టీఎంసీలు	3.34
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	13.07 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	121.10 క్యూసెక్కులు

జీతాలు అందక అవస్థలు

● 11 నెలలుగా ఎఫ్‌టీఎస్‌లకు అందని వేతనాలు ● ధరణితో పాటు మా జీ(వి)తాలను చక్కదిద్దాలని వేడుకోలు

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ)

రెవెన్యూ విభాగంలో కీలకభూమిక పోషిస్తున్న ధరణి ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగంలో చేరి ఏళ్లు గడుస్తున్నా వేతనాల కోసం అవస్థలు తప్పడం లేదు. 2018లో అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆపరేటర్లను నియమించింది. విధుల్లో చేరిన ఏడాది వరకు నెల నెలా వేతనాలు ఇచ్చినా ప్రభుత్వం మరుసటి ఏడాది నుంచి రెండు నెలలు జీతాలు ఇస్తే మరో ఐదారు నెలలు వేతనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సగం జీతం ఉద్యోగుల పేర కాంట్రాక్ట్ కంపెనీలే తీసుకుంటుండగా అరకొర జీతాలతో కుటుంబాలు నెట్టుకొస్తున్న ఫీల్డ్ టెక్నిక్ స్టాఫ్(ఎఫ్‌టీఎస్) 11నెలలుగా జీతాలు అందక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు అధిగమించలేక సతమతమవుతున్నారు. ధరణి వెబ్‌సైట్‌ను తీర్చిదిద్ది భూమాతగా మార్పుచేస్తున్నట్లే ఆపరేటర్ల జీవితాలను ఆర్థికభారం నుంచి గట్టెక్కించి ఉద్యోగ గ్యారెంటీ, నెలవారీ వేతనాల చెల్లింపులపై దృష్టి సారించాలని వేడుకుంటున్నారు.

రికార్డుల నిర్వహణ కోసం..

ప్రభుత్వం వెబ్‌ల్యాండ్ నిర్వహణకు 2018 మే 23న రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒకరిని చొప్పున 584మంది ఎఫ్టీఎస్, వారికి తోడు గా 31జిల్లాల్లో జిల్లా కోఆర్డినేటర్లతో కలిపి 713 నియమించేందుకు ఇంటి గ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎల్అండ్ఎఫ్ఎస్) అనే కంపెనీ గతంలో టెరాసిస్‌కి అవకాశం కల్పించింది. దానినుంచి ప్రస్తుతం ఎన్ఐసీకి బదిలీ చేశారు.
ఇది సైట్ నిర్వహణ, డిజైనింగ్ పనులను నిర్వహిస్తూ ఉద్యోగుల నియామక బాధ్యతలను ఈసెంట్రిక్ (ప్రస్తుతం పారాడిగమ్ ఐటీ)అనే మరో కంపెనీకి అప్పగించింది. ఎఫ్టీఎస్‌లకు నెలకు రూ.11వేల చొప్పున ప్రభుత్వం వేతనం చెల్లిస్తూ వస్తోంది.

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం : ధరణి ఆపరేటర్

గత ఏడాది మార్చి నుంచి వేతనాలు రావడం లేదు. రెవెన్యూ శాఖ మంత్రిని, ఉద్యోగ సంఘం నాయకులను కలిసి వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా ఓ మండల ధరణి ఆపరేటర్ ఆవేదన వ్యక్తం చేశాడు. పిల్లల స్కూల్ ఫీజులకు, కుటుంబ పోషణకు కటకటపడాల్సి వస్తోందన్నారు. ఇచ్చేదే తక్కువ జీతం అది కూడా ఇవ్వకపోతే పూట గడవడం కష్టంగా మారుతోందని, ప్రభుత్వం నెలనెలా జీతాలు ఇచ్చేలా చూడాలని కోరాడు.



రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్‌టీఎస్‌లు (ఫైల్)

జీతం తక్కువ.. పని ఎక్కువ

గత బీఆర్ఎస్ ప్రభుత్వం వెబ్‌ల్యాండ్ స్థానంలో ధరణి సైట్‌ను తీసుకొచ్చింది. మండలాల వారీగా రైతులకు ఈ వెబ్‌సైట్ ద్వారా విశేష సేవలు అందించేందుకు ఎఫ్టీఎస్ ఉద్యోగులకు నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. మండల రెవెన్యూ కార్యాలయంలో ఉదయం అడుగు పెట్టిన దగ్గరి నుంచి నుంచి సాయంత్రం వరకు బిజీబిజీగా గడపాల్సిందే. ఒక్కోరోజు తహసీల్దార్ బయట విజిట్‌లకు వెళ్లినప్పుడు రాత్రి 10 గంటల వరకు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. సర్వే నెంబర్ల వారీగా రైతుల వేలిముద్రల సేకరణ, సైట్‌లో వివరాలు పొందుపరచడం వంటి పనుల్లో ఎఫ్టీఎస్‌లు బిజీబిజీగా గడపాల్సి వస్తోంది. ల్యాండ్ రిజిస్ట్రేషన్స్ విధులు తహసీల్దార్లకు బదిలీ అయిన తర్వాత మరింత బిజీగా మారిందని పలువురు ఆపరేటర్లు పేర్కొంటున్నారు. రోజుకు 12గంటలకు పైగా కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నా రూ.11వేల జీతం మాత్రమే అందుతోంది. జీవో 63, 2021 ప్రకారం తమ జీతాలను రూ.31 వేలకు పెంచాలని డిమాండ్ చేసి నప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 81మంది ఉండగా వారిలో నల్లగొండ జిల్లాలో 36, సూ ర్యాపేట జిల్లాలో 26, యాదాద్రి భువనగిరి జిల్లాలో 19 మంది ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. కంపెనీలు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలు వీధిన పడే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మార్చి, ఏప్రిల్ జీతాలకు సంబంధించిన ఫైల్ ఆర్థిక శాఖకు చేరినట్లు భావిస్తున్నా వేతనాలు విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారు.

సాంకేతిక లోపాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

గత నెలల రోజులుగా భూముల రిజిస్ట్రేషన్ సేవలలో తీవ్రజాప్యం నెలకొంటోందని రైతులు వాపోతున్నారు. సర్వేనెంబర్‌లలో వున్న భూవివరాలు, విస్తీర్ణం తదితర వివరాల తెలుసు కోవాలన్న ఒక్కోసారి గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోందని వాపోతున్నారు. టెరాసిస్ కంపెనీ నుంచి సైట్ నిర్వహణ ఎన్ఐసికి బదిలీ జరగడంతో సాంకేతిక సమస్యల తలెత్తుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పూర్తిస్థాయిలో టెరాసిస్ నుంచి ఎన్ఐసీకి డాటా అందకపోవడంతో జాప్యం జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో రోజుకు రెండు మూడు రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సాంకేతిక లోపాలను సవరించి రైతుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

జీతంలో కోత

ఒక్కో ఎఫ్టీఎస్‌కు ప్రభుత్వం 2021 జూన్ వరకు ఐఎల్అండ్ఎఫ్ఎస్ కంపెనీ ద్వారా రూ.18 వేలు చెల్లించగా 21 జూలై నుంచి టెరాసిస్ కంపెనీ (ప్రస్తుతం ఎన్ఐసీ) ద్వారా రూ.24 వేలు చెల్లిస్తోంది. ఇందులో ఒక్కో ఉద్యోగి జీతం నుంచి నెలకు రూ. 5వేల చొప్పున టెరాసిస్ కంపెనీ తీసుకుంటోంది. మిగిలిన రూ.19వేలలో పారాడిగమ్ ఐటీ కంపెనీ రూ.3వేలు కోత విధిస్తోంది. మిగతా రూ.16వేలలో పీఎఫ్, ఈఎస్ఐ కటింగ్‌లు పోనూ నికరంగా ఒక్కో ఎఫ్‌టీఎస్ ఉద్యోగికి రూ.11 వేల వరకు జీతం అందుతోంది. గత మార్చి నుంచి 11నెలలుగా సదరు కంపెనీలు జీతాలు చెల్లించకపోవడంతో ఎఫ్టీఎస్ ఉద్యోగుల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. జీతం కోసం ఎవరిని అడగాలో తెలియక రాష్ట్రంలోని 713 మంది ఉద్యోగులు తల్లడిల్లుతున్నారు.

ధరణి నుంచి భూమాతగా...

దరణి సైట్‌లో నెలకొన్న లోపాలు సవరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం దరణి స్థానంలో భూమాత వెబ్‌సైట్‌ను తీసుకువచ్చేందుకు సన్నద్ధమైంది. ఉద్యోగుల నియామక బాధ్యతలను నిర్వహిస్తున్న పారాడిగమ్‌ఐటీని తప్పించి 2025 జనవరి 1నుంచి ప్రభుత్వం టీజీటీఎస్‌కు అప్పగించింది. భూమాత విధులు నిర్వహించే ఆపరేటర్లకు సైతం జీతం పెంచి నెలనెలా ట్రెజరరీ ద్వారా వేతనాలు చెల్లించాలని, ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని, రెవెన్యూ శాఖాధికారులను అభ్యర్థిస్తున్నారు.

అర్హులందరికీ పథకాలు అందుతాయి

మర్రిగూడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ నిరంతరం ప్రక్రియ అని ఎవరూ ఆందోళన చెందవద్దని రాష్ట్ర కాంగ్రెస్ ఆదివాసీ, కార్యవర్గ కమిటీ సభ్యులు రమావత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేటతండాలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటుందన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా నిరుపేదలను గుర్తించి వారికి ముసాయిదా జాబితాలో పేర్లు నమోదు చేశారని, కొన్ని సాంకేతిక పొరపాట్ల వల్ల అర్హుల పేర్లు రాలేదని, ఏ ఒక్కరూ ఆందోళన చెందవద్దని అన్నారు. అధికారులు పథకాలు అర్హులకు అందే విధంగా చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో రమావత్ రవినాయక్, కృష్ణానాయక్, రాములునాయక్, శేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు రంగశాయిరెడ్డి కన్నుమూత

నిడమనూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నల్లగొండ జిల్లా నిడమనూరు మాజీ ఎంపీపీ, కుందూరు జానారెడ్డి ముఖ్య అనుచరుడు యడవెల్లి రంగశాయిరెడ్డి(74) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన రంగశాయిరెడ్డిది దొరల కుటుంబమైనప్పటికీ పేదలకోసం పనిచేస్తూ ప్రజా నాయకుడిగా పేరు పొందారు. జానారెడ్డి కోరిక మేరకు రాజకీయాల్లో ప్రవేశించిన ఆయన 1987లో టీడీపీ తరఫున నిడమనూరు ఎంపీపీగా పోటీచేసి ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం సాధించి తొలి ఎంపీపీగా పనిచేశారు. 1999లో మిర్యాలగూడ పార్లమెంట్ నుంచి పోటీ చేసి జైపాల్‌రెడ్డి చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2014లో నిడమనూరు సింగిల్ విండో చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జానారెడ్డి వెన్నంటే ఉంటూ జానారెడ్డి, రఘువీర్‌రెడ్డి, జైవీర్‌రెడ్డి విజయాల్లో కీలక పాత్ర పోషించారు. త్వరలోనే ఆయనకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవి వస్తుందనుకుంటున్న తరుణంలో అనారోగ్యంతో మృతిచెందడంతో పార్టీ శ్రేణులు శోకసంద్రంలో మునిగిపోయాయి. ఆయనకు భార్య, కుమారుడు వల్లభ్‌రెడ్డి ఉన్నారు. రంగశాయిరెడ్డి భౌతికకాయాన్ని సొంత గ్రామమైన తుమ్మడం తీసుకువచ్చారు. నిడమనూరు, బొక్కమంతలపహడ్, ముకుందాపురం, మారుతివారిగూడెం గ్రామాల మీదుగా తుమ్మడం వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అంతిమయాత్రలో పార్టీ శ్రేణులు, అభిమానులు, వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విలపిస్తూ తమ నాయకుడికి కన్నీటి నివాళులర్పించారు. సీఎల్పీ మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కరరావు, నోముల భగత్, నేతి విద్యాసాగర్, విజయేందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, కొండేటి మల్లయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, హనుమంతరావు, నందికొండ మట్టారెడ్డి, అంకతి వెంకటరమణ, గండికోట యాదగిరి, శివమారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బుసిరెడ్డి పాండురంగారెడ్డి, నూకల వెంకట్‌రెడ్డి, నర్సింగు విజయ్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన భౌతికకాయంపై కుందూరు జానారెడ్డి కాంగ్రెస్ కండువాను కప్పారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, భాస్కర్‌రావులు పాడె మోయగా సాయంత్రం తుమ్మడంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.





రంగశాయిరెడ్డి పార్థివదేహంపై కాంగ్రెస్ జెండా కప్పుతున్న జానారెడ్డి, రంగశాయిరెడ్డి(ఫైల్)

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

నల్లగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 22, 23, 24వ తేదీతో పాటు 28, 29, 30వ తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ప్రతిరోజూ రెండు సెషన్‌లలో నిర్వహిస్తారు. మొదటి సెషన్ ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు మధ్నాహ్నం సెషన్ 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ జి. పార్థసారథి తెలిపారు. మొదటి సెషన్ అభ్యర్థులు ఉదయం 7.30గంటలకు, రెండో సెషన్ అభ్యర్థులు మధ్నాహ్నం 1.30 గంటల నుంచి పరీక్షలకు అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం గుర్తింపు పొందిన కార్డును తీసుకురావాలని సూచించారు.

వైభవంగా 'గిరి'ప్రదక్షిణోత్సవం

● వేకువజామున స్వాతినక్షత్ర వేడుకలు
● ప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్సీలు కవిత, నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు
● మొక్కులు తీర్చుకున్న భక్తులు



వేకువజామున గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

భువనగిరి అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున గిరిప్రదక్షిణ చేపట్టారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చి సుమారు 15వేల మంది భక్తులు ఆరగింపు సమయం వరకు ప్రదక్షిణ కొనసాగించారు. వేకువజామున 3గంటల నుంచే కొందరు భక్తులు గిరిప్రదక్షిణ మొదలుపెట్టగా ఉదయం 5.30 గంటలకు వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ వైకుంఠ ద్వారం వద్ద ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. ప్రదక్షిణలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బూడిద బిక్షమయ్య, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్, గొంగిడి సునీత, కంటెస్టడ్ ఎంపీ క్యామ మల్లేష్ కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్లు సుమారు 45నిమిషాల పాటు స్వామి స్మరణతో భక్తులు ప్రదక్షిణ పూర్తి చేశారు. అనంతరం మెట్ల దారి వెంట ఎమ్మెల్యేలు వెళ్లి స్వామిని దర్శించుకున్నారు.

స్వాతి నక్షత్ర వేడుకలు

కాగా, స్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయ ముఖమడపంలో వేకువజామున అర్చకులు స్వాతి నక్షత్ర పూజల్లో భాగంగా 108కలశాలపై నూతన వస్త్రాలు కప్పి వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పవిత్ర నదీ జలాలు, పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హోమం చేపట్టి ఉత్సవమూర్తులను, ఆలంకార మూర్తులను అభిషేకించి తులసీ దళాలతో సహస్రనామార్చనలు చేశారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి 108 సువర్ణ పుష్పాలతో అర్చించారు. కాగా ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.18,98,777 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

గర్భాలయంలో కిక్కిరిసిన భక్తులు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం రోజున గిరిప్రదక్షిణ నిర్వహించారు. గిరిప్రదక్షిణలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, నవీన్‌కుమార్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, బూడిద బిక్షమయ్య, చిరుమర్తి లింగయ్య, గాదరీ కిశోర్, కంటెస్టెడ్ ఎంపీ క్యామ మల్లేష్ పాల్గొని ప్రదక్షిణ ముగిసిన తర్వాత మెట్ల మార్గంలో కొండెక్కి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులతో పాటు అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివచ్చిన సమయంలో గర్భాలయం పూర్తి నిండిపోయింది. ఎవరి ఇష్టానుసారంగా వారు తమ సెల్‌ఫోన్లో ఫోటోలు తీసుకున్నారు. సెల్‌ఫోన్ నిషేధాజ్ఞలు ఎక్కడ కనిపించలేదు. భద్రత సిబ్బంది ఎంత కట్టడి చేసినప్పటికి కార్యకర్తలు వినిపించుకోకుండా చొచ్చుపోయేందుకే ప్రయత్నం చేశారు. మహిళ కానిస్టేబుల్, సురక్ష సిబ్బంది కూడా వేద ఆశీర్వచన మండపంలో ఎమ్మెల్సీ కవితతో సెల్ఫీ, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి వేర్వేరుగా ఫొటోలు దిగారు. వైకుంఠద్వారం వద్ద కూడా పెద్ద సంఖ్యలో చేరిన కార్యకర్తలు, భక్తులు ఎమ్మెల్సీ కవితతో ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు.



యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి ఆలయంలో భక్తజన సందోహం

జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతలకు అదనంగా రూ.100కోట్లు

●బెట్టైతండాలో మూసీ నదిపై చెక్‌డ్యామ్‌కు రూ.7.5 కోట్లు
● అధికారుల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పాలకవీడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకానికి అదనంగా రూ.100కోట్లు, బెట్టైతండాలో మూసీ నదిపై చెక్‌డ్యాంకు రూ.7.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టులపై మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో అధికారులు, మండల మాజీ ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ173 కోట్లతో 5650 ఎకరాల పంట సాగు కోసం నిర్మించనున్న జావహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్‌కు మరో రూ.100 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. దీంతో ఈ లిఫ్ట్ సామర్థ్యం పెరగడంతోపాటు ఆయకట్టు మరో వేల ఎకరాలు పెరగనుందన్నారు. ఈ నీటితో జాన్‌పహాడ్ మునిమోపుల చెరువును నింపేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా బెట్టైతండాలో మూసీ నదిపై చెక్‌డ్యాంకు రూ.7.5 కోట్లు మంజూరు చేశారు. జాన్‌పహాడ్ గ్రామం నుంచి జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ పంపుహౌస్ వరకు మెటల్ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేశారు. ఈ పనులన్నీ వచ్చే పంటల సాగు వరకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిర్ణయాలపై మాజీ జడ్పీటీసీ మోతీలాల్, మాజీ ఎంపీపీ గోపాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సప్పిడి నాగిరెడ్డి, తీగల వెంకట్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

టెండర్ వేలం ఆదాయం రూ.68.83లక్షలు



సూర్యాపేటలో టెండర్లను తెరుస్తున్న మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

సూర్యాపేట టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రం శివారులోని దురాజ్‌పల్లి లింగమంతుల(గొల్లగట్టు) స్వామి జాతర సందర్భంగా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పలు టెండర్ వేలం ప్రక్రియ బుధవారం నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్, చిరు దుకాణాల ఖాళీ స్థలం, మిఠాయి, స్వీట్లు, వరి పేలాలు, బొంగులు, చెరుకు గడలు, జాతర చుట్టూ విద్యుత్ సరఫరాకు టెండర్లను పిలిచారు. ఈ టెండర్లను టెండరు దారుల సమక్షంలో బుధవారం సూర్యాపేటలోని మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ ఓపెన్ చేశారు. ఎగ్జిబిషన్‌కు 15దరఖాస్తులు జారీ చేయగా, ఏడుగురు టెండర్లు దాఖలు చేశారు. టెండర్‌ను ఎల్.గోపాలకృష్ణ రూ.35.50లక్షలకు తండు నాగేందర్‌పై రూ.15 వేల తేడాతో దక్కించుకున్నాడు. చిరుదుకాణాలు, ఖాళీ స్థలాలకు తొమ్మిది దరఖాస్తులు వచ్చాయి. ఐదుగురు టెండర్లు వేయగా, మామిడి కిరణ్ రూ.24.05 లక్షలకు దక్కించుకున్నాడు. మిఠాయి, స్వీట్లకు ఎనిమిది దరఖాస్తులకు నలుగురు టెండర్లు వేశారు. వాజిద్ రూ.6.60 లక్షలకు దక్కించుకు న్నారు. వరి పేలాలు, బొంగులుకు ఐదు దరఖాస్తులకు ఇద్దరు టెండరు వేశారని, కనీస రూ.3.30లక్షలకు మించి ఎవరూ పాడనందున టెండర్‌ను రీకాల్ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అదేవిధంగా జాతర చుట్టూ విద్యుత్ సరఫరాకు రెండు దరఖాస్తులు రాగా మొండికత్తి జానకిరాములు రూ.89వేలకు టెండర్ దక్కించుకున్నాడు. 2022-2023 జాతర సందర్భంగా మునిసిపాలిటీకి టెండర్ల ఆదాయం రూ.56,43,754 రాగా, ప్రస్తుతం రూ.68,83,650 వచ్చింది. కాగా రూ.12,39,896 ఆదాయం పెరిగింది.

వైభవంగా నృసింహుని కల్యాణం



మట్టపల్లి ఆలయంలో గరుడోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి మహాక్షేత్రంలో బుధవారం శ్రీలక్ష్మీ నృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వీధుల్లో అర్చకులు, పూజారులు గరుడోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈవో సిరికొండ నవీన్. తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, సీతారామశాస్త్రి, శేషగిరిరావు, రాజేష్, రమేష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'20 రోజుల నిబంధన ఎత్తివేయాలి'

మునగాల రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనిలో 20 రోజులు పనిచేసిన వారికే ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు ఇస్తాననడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు సోమపంగు జానయ్య అన్నారు. బుధవారం మండలంలోని రేపాల గ్రామంలో ఎంపీవో దారా శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. 20 రోజుల నిబంధనను రద్దుచేసి అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలని, లబ్ధిదారుల జాబితా నుంచి అనర్హులను తొలగించాలన్నారు. గ్రామసభలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాల సాధనకు కృషి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : గాంధీజీ ఆశయాలకనుగుణంగా ఆయన అడుగుజాడల్లో నడిచిన మహనీయుడు స్వామి రామానంద తీర్థ అని, స్వామి రామానంద తీర్థ ఆశ యాల సాధనకు కృషి చేద్దామని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్ డా. ఎన్ కిషోర్ రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో బుధవారం స్వామి రామానందతీర్థ 53వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంస్థ ఆవరణలోని స్వామి రామానందతీర్థ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఆర్‌టీఆర్ఐ సంస్థ డైరెక్టర్ సాయిలక్ష్మి, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.



స్వామి రామానందతీర్థ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కిషోర్‌రెడ్డి

పంటల పరిశీలన

మోత్కూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను బుధవారం ఎన్ఎస్ఎస్‌వో (నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీసు) అధికారులు పరిశీలించారు. ఏవోలు, ఎంపీఎస్‌వో ఇచ్చిన పంటల సాగు నమోదు వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలిస్తారు. పంటల సాగు వివరాల నమోదు పరిశీలించాల్సిన గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వమే ఎంపిక చేసి, ఎన్ఎస్ఎస్‌వో హైద రాబాదు అధికారులకు సమాచారం ఇస్తారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.జయరామ్, వివిఎల్.విజయ, ప్రభాకర్, ఏడీఎస్ నీలిమ, ఎస్.లక్ష్మణ్ పాటిమట్లలో పంటలను పరిశీలించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



జడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ భిక్షపతి

నార్కట్‌పల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నార్కోటిక్స్ డిపార్ట్‌మెంట్ డీఎస్పీ పీ.భిక్షపతి సూచించారు. మండలంలోని ఎల్లారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలు-దుష్ఫలితాలపై జరిగిన అవగాహన సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల బారిన పడి వాటికి బానిసలుగా మారిన కొందరు వాటిని మీకు అంటగట్టాలని చూస్తారు కాని వాటి జోలికి వెళ్లొద్దని జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. విద్యార్థుల నడవడికను ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ఎపుడూ గమనిస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సౌమ్యనాయక్, హెచ్ఎం హిమజ, నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు సమీర్ కుమార్ పాల్గొన్నారు.

అంగడి స్థలంపై విచారణ చేయాలి

నార్కట్‌పల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లిలోని మజీదు ఎదురుగా ఉన్న కూరగాయల అంగడి స్థలం వివాదంపై క్షేత్రస్థాయి విచారణ చేయాలని కోరుతూ నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి (ఎన్‌పీఎస్) ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి విజ్ఞప్తి చేశారు. బుధవారం నార్కట్‌పల్లిలోని గ్రామసభకు హాజరైన కలెక్టర్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఇదే సమస్యపై గతంలో తహసీల్దార్, ఎంపీడీవో ఇతర పోలీసు అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికే తాను సమాచారం సేకరించానన్నారు. సమస్యను సున్నితంగా పరిష్కరించడానికి కొంత సమయం పడుతుందన్నారు. అలాగే మండల కేంద్రంలోని వైఎస్ఆర్ కాలనీలోని ప్రభుత్వ బలహీనవర్గాల కాలనీలో ప్లాట్ల అక్రమ దందాపై విచారణ చేయించాలని కోరారు.

పాఠశాలలకు సిలిండర్లు, స్టవ్ అందజేత



ఆకారం జడ్పీ స్కూల్‌కు గ్యాస్టవ్, సిలిండర్లు అందిస్తున్న సమరం రెడ్డి

శాలిగౌరారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకారం గ్రామ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, తన తండ్రి భద్రారెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా సిలిండర్లు, స్టవ్ బుధవారం అందజేశారు. అంతకు ముందు భద్రారెడ్డి విగ్రహానికి పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు అయితగోని సైదులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండపెల్లి కొమరయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగే నర్సింహ, వల్లాల మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్ అహ్మద్, యూత్, బొల్లికొండ గణేష్, లోడంగి మహేష్, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎర్రజెండా : సీపీఎం

శాలిగౌరారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ఎజెండా ఎర్రజెండానేనని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు కందాల ప్రమీల అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ మండల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాలి కాని, ఆర్థిక భారం మోపకుండా చూడాలని అన్నారు. అనంతరం సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర 4న మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు మక్క బుచ్చిరాములు, కారింగుల వెంకన్న, యల్లంల వెంకటయ్య, కల్లూరి లింగయ్య, సిరిపంగి అంజి, దండ సోమిరెడ్డి, యర్ర రమేష్, దాసరి దేవచిత్తం పాల్గొన్నారు.

ఆంగ్ల ఒలంపియాడ్ విజేత శ్రీవిద్య



శ్రీ విద్యకు మెమోంటో అందజేస్తున్న నిర్వాహకులు

శాలిగౌరారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న పాక శ్రీ విద్య జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇంగ్లిష్ ఒలంపియాడ్ పోటీల్లో జిల్లా ప్రథమ బహుమతి పొందారు. ఈ సందర్భంగా ఆంగ్ల విభాగాధిపతి చిత్తలూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఆధునిక సమాజంలో ఆంగ్ల విద్య ఆవశ్యకత ఎంతో ఉందని, ఆ దిశగా తాము ప్రయత్నం చేస్తున్నామనడానికి ఇలాంటి ఫలితాలు నిరూపిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాక శ్రీ విద్యను ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా వెంకటేష్

మర్రిగూడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం నూతన అధ్యక్షుడిగా గ్యార వెంకటేష్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో కళా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన కార్యదర్శిగా దనావత్ బాలాజీ, ఉపాధ్యక్షుడిగా వీహెచ్ రాజు, లక్ష్మి, కోశాధికారిగా పెరుమాళ్ల ఉపేందర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎంఈవో శ్రీనును మర్యాద పూర్వకంగా కలిసి ఎంఈవోను సన్మానించారు.

అప్పులు తీరుస్తూ అభివృద్ధిలోకి తెస్తున్నాం

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ● రెండో రోజు కొనసాగిన గ్రామ సభలు



చిట్యాల మండలం వట్టిమర్తిలో మాట్లాడుతున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి, చిట్యాల రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం గత పాలకులు చేసిన అప్పులు తీరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తెస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చెప్పారు. 26 నుంచి అమలులో రానున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపై కేతేపల్లి మండలం కొర్లపహాడ్, చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్ల అప్పులో ముంచిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఓ వైపు గత పాలకులు చేసిన అప్పులకు వేలకోట్లు వడ్డీలు చెల్లిస్తూ మరోవైపు అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు ఎడ్ల పార్వతమ్మ, ఎడ్ల సంధ్య, ఏవో బి.పురుషోత్తం,కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు. అలాగే కాసనగోడు, కొండకిందిగూడెం, కొప్పోలు, కొర్లపహాడ్ గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. కొప్పోలు గ్రామసభలో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి అర్హుల గుర్తింపుకు నిర్వహించిన సర్వే నివేదికలను పరిశీలించారు. ఆయా పథకాలకు గ్రామాల్లోని ప్రజల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఆయా గ్రామసభల్లో మండల ప్రత్యేక అధికారి జి.హరీష్, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఏవో బి.పురుషోత్తం, ఎంపీవో నాగలక్ష్మి, ఆర్ఐ ఛాంద్‌పాషా, పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఆర్డీవో

నాంపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయని చండూరు ఆర్డీవో శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని మేళ్లవాయి, పసునూరు, రాజ్యతండా, నెమిళ్లగూడెం, పీపీగౌరారం, మహమ్మదపురం, చిట్టెంపాడు గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభలు నిర్వహించారు. పసునూరు గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలో ఆమె పాల్గొన్నారు. జాబితాలో పేర్లురానివారు ఆందోళన చెందకుండా మరల దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవసింగ్, ఎంపీడీవో స్వర్ణమేరికుమారి, ఎంపీవో ఝాన్సీరెడ్డి, ఏఈలు రామచంద్రయ్య ఉదయ్ సాయిరెడ్డి, ఎంఈవో మల్లికార్జున్‌రావు ఏవో శివ పాల్గొన్నారు.

● కట్టంగూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునుకుంట్ల, రామచంద్రాపురం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు పాల్గొని మాట్లాడారు. ఆయా గ్రామ సభల్లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఏవో గిరి ప్రసాద్, ఎంపీవో చింతమల్ల చలపతి ఉన్నారు.

● శాలిగౌరారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురజాల, మనిమద్దె గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈఈ, మండల ప్రత్యేకాధికారి మన్యానాయక్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీవో పద్మ, ఏపీఎం దర్శనబోయిన రాములు, పంచాయతీ కార్యదర్శి పర్వతం కృష్ణలు పాల్గొన్నారు. ఇటుకలపహాడ్‌లో తహసీల్దార్ పి.యాదగిరి, పెర్కకొండారంలో ఎంపీడీవో బానోతు సుధాకర్, నూలగడ్డకొత్తపల్లిలో ఏఓ సౌమ్య శృతి , ఉట్కూర్‌లో డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్ పాల్గొన్నారు.

● చండూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఉడుతలపల్లి, చామలపల్లి, నెర్మట, కస్తాల గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభలు రసాభాసాగా సాగాయి. ఉడుతలపల్లి గ్రామంలో ఎంపీడీవో రాంరెడ్డి పాల్గొని గ్రామసభలో లబ్ధిదారుల ఎంపిక జాబితాను చదివి వినిపించారు. చామలపల్లి లో ఏవో చంద్రిక, నెర్మటలో ఎంపీవో మాధవరెడ్డి, కస్తాలలో సూపరింటెండెంట్ నర్సింహ పాల్గొని లబ్ధిదారుల జాబితా చదివి వినిపించారు. అలాగే ఆయా గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. చామలపల్లిలో జాబితాపై అధికారులతో వాగ్వాదానికి దిగారు. అర్హత లేని వారి పేర్లు జాబి తాలో ఉండి అర్హత ఉన్న వారి పేర్లు జాబితాలో లేకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

● కనగల్, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేగట్టె గ్రామసభలో తాహసీల్దార్ పద్మ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా పథకాలకు ఎంపిక చేసిన లబ్దిదారుల జాబితాను సభలో వెల్లడించారు. సమావేశంలో అధికారులు తదితరులున్నారు.

● నల్లగొండ రూరల్ : నల్లగొండ పట్టణంలోని 18వ వార్డులో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్ద దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, గుండపునేని కిషన్‌రావు, జూలకంటి దయాకర్ రెడ్డి, నాకీలా నర్సయ్య పాల్గొన్నారు.



నల్లగొండలో దరఖాస్తు స్వీకరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నం రాజు

పేర్లు గల్లంతవ్వడంపై ఆందోళన

చిట్యాలరూరల్,(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెగూడెం, పిట్టంపల్లి, తాళ్లవెల్లంల, బొయగుబ్బ, వట్టిమర్తి గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. అయితే అర్హుల జాబితాల్లో తమ పేర్లు లేవని ఆరెగూడెంలో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పథకాలకు సంబంధించి సర్వే చేశారని తాము అర్హులమైనప్పటికీ జాబితాలో పేర్లు గల్లంతవ్వడంపై అధికారులను నిలదీశారు. అర్హులందరికీపథకాలు మం జూరయ్యేలా చూస్తామని జాబితాలో పేర్లు లేనంత మాత్రాన ఆందోళన చెందవద్దని అధికారులు తెలిపారు.

● మర్రిగూడ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో వట్టిపల్లి, దామెరభీమనపల్లి, కొట్టాలల్లో గ్రామ సభలు నిర్వహించారు. అనర్హులైన వారికి పథకాలను మంజూరు చేయడం పట్ల గ్రామ సభలు రసాభాసాగా మారింది. మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, ఎంపీడీవో మున్నయ్య మాట్లాడుతూ పేర్లు రానివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఓపెన్ ఫోరం

శాలిగౌరారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 10గంట లకు 14వ విడత ఉపాధి హామీ పథకం ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్న ట్లు ఎంపీడీవో బానోతు సుధాకర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

నిర్దేశిత చార్జీలు వసూలు చేయాలి

నార్కట్‌పల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మీ సేవ, ఆధార్ కేంద్రాల నిర్వాహకులు ఆయా సేవలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలను మాత్రమే వసూలు చేయాలని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. బుధవారం తన కార్యాల యంలో మీ సేవ కేంద్రాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ మీ సేవ సెంటర్‌లో ధరల పట్టికను ప్రదర్శించాలని, దర ఖాస్తుదారుడు ఇచ్చిన అన్ని డాక్యు మెంట్లను విధిగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆర్ఐ తరుణ్, మీ నిర్వాహకులు రాందాసు, శోభారెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

నార్కట్‌పల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మనబోలులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంగళవారం పూరిగుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఓర్సు లక్ష్మమ్మకు చెందిన గుడిసె షార్ట్‌సర్క్యూట్‌తో నిప్పంటుకుని దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అగ్ని ప్రమాదంలో నిత్యావసర వస్తువులు, దుస్తులు, రూ.50 వేల నగదు కలిపి దాదాపుగా రూ. లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితురాలు పేర్కొంది.

లక్ష డప్పుల కమిటీ

నార్కట్‌పల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మనబోలులో వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల కార్యక్రమ కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షునిగా బోడ కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా చుక్క మల్లేశ్‌లతో పాటు 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. మేడి నరసింహ, ఎల్లయ్య, లింగాల యాదయ్య, చింత లక్ష్మణ్, తదితరులున్నారు.

మాజీ సర్పంచ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి



శాలిగౌరారం : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

శాలిగౌరారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఉప్పలంచ మాజీ సర్పంచ్ బండారు మల్లయ్యపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ జిల్లా ఉపా ధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాల యంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప్పలంచ గ్రామానికి చెందిన మల్లయ్య రెండు సార్లు సర్పంచుగా గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశాడన్నారు. వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన సమయంలో కొందరు వ్యక్తులు విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచి చంపే ప్రయత్నం చేశారు. సౌమ్యుడిగా ఎవరికీ హాని కలిగించకుండా ఉండే వ్యక్తిని ఇలా చేయడం హేయమైన చర్య అన్నారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య, మాజీ సర్పంచ్ అల్లి సైదులు, జిల్లా నాయకులు పెరు మాండ్ల నరేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల రమేష్, నాయకులు కడారి అంజయ్య, వంగూరి వెంకన్న, రామగిరి, మొగుళ్ల శ్రీను, సత్తయ్య పాల్గొన్నారు.

రైతుల కోసం ఎఫ్‌పీవో ఏర్పాటు అభినందనీయం



కట్టంగూరు : గంగాదేవిగూడెంలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని పరిశీలిస్తున్న అధికారులు

కట్టంగూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం కట్టంగూరు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏర్పాటు చేయడం అభినందనీయమని జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ బాబు అన్నారు. మండలంలోని గంగాదేవిగూడెంలో కట్టంగూరు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీని బుధవారం ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. కంపెనీలో రైతులకు వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉండే విధంగా దుకాణాలను ఏర్పాటు చేయడం, రైతులు తెచ్చిన నిమ్మ కాయలు, కూరగాయలు పెట్టుకు నేందుకు పెద్ద షెడ్డు ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. ఈ కంపెనీలో రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ వినియోగదారులకు కావాల్సిన విధంగా తయారు చేసిందన్నారు. కంపెనీ నిర్వహిస్తున్న నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, కంపెనీ చైర్మన్ చెవుగోని సైదమ్మను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైంటిస్ట్ సురేష్‌రెడ్డి, భరత్, శ్యాంసుందర్ రెడ్డి, శ్వేత, నిషిత, చైర్మన్ సైదమ్మ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసంలో కాంగ్రెస్‌కు సంబంధం లేదు



కట్టంగూరు : అయిటిపాముల లిఫ్ట్ వద్ద మాట్లాడుతున్న రైతులు

కట్టంగూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిటిపాముల ఎత్తిపోతల పథకం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంలో కాంగ్రెస్ నాయకులు, రైతులకు గాని ఎలాంటి సంబంధం లేదని చెర్వుఅన్నారం మాజీ సర్పంచ్ నంద్యాల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎడ్ల పెద్ద రాములు తెలిపారు. మండలంలోని అయిటి పాముల లిఫ్ట్ వద్ద చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన రైతులతో కలిసి లిఫ్ట్‌ను బుధవారం వారు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అయిటిపాముల ఎత్తిపోతల పథకాన్ని 2018లో అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మంజూరు చేయించాడని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహ కారంతో జనవరి 2025లోనే లిఫ్ట్ కింద భూములు నష్టపోయే రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించిందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తానే ఎత్తిపోతల పథకాన్ని తానే మంజూరు చేయించాననడం హాస్యాస్పదం అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని తెలిపారు. సమావేశంలో రైతులు చెవుగోని రవి, చిలుముల సైదులు, నంద్యాల వెంకట్ రెడ్డి, చెవుగోని సైదులు, రామస్వామి, భిక్షం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



కనగల్ : సభలో నాయకుల అభివాదం చేస్తున్న నాయకులు

కనగల్, జనవరి 22.(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించి ఆ సంఘం బహిరంగ సభలో వారు మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్షడప్పులు వెయ్యి గొంతుకల బహిరంగ సభకు పెద్దసంఖ్యలో మాదిగలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కందుల మోహన్‌మాదిగ అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు బోడ సునీల్, దుబ్బ సత్యనారాయణ, కందుల మార య్య, దేవేందర్, కొండ రవి, ఎర్రోళ్ల శ్రీను పాల్గొన్నారు.



బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

మర్రిగూడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను రూపుమాపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద అన్నారు. బేటీ బచావో బేటి పడావో కార్యక్రమం సందర్భంగా బుధ వారం దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ప్రభుత్వం ఉచితంగా విద్యను అందిస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలని ప్రధా నోపాధ్యాయులు సంజీవరావు అన్నారు. ఏఎన్ఎం సరిత, అంగన్‌వాడీ టీచర్ మరియమ్మ, పాఠశాల సిబ్బంది పలువురు ఉన్నారు.

నెల్లికంటి సత్యానికి పలువురి పరామర్శ

మునుగోడు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లి టకంటి సత్యం తల్లి పార్వతమ్మ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. మండలంలోని ఎలుగల గూడెం గ్రామంలో బుధవారం సత్యం కుటుంబాన్ని సీపీ ఎం జాతీయ కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే నివాళులర్పించిన వారిలో చిట్యాల మాజీ సర్పంచ్ జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, శ్రవణ్ కుమార్, సురిగి చలపతి, తీర్పారి వెంకటేశ్వర్లు, లింగస్వామి పాల్గొన్నారు.



పార్వతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చెరుపల్లి సీతారాములు


కనగల్ హైస్కూల్‌ను సందర్శించిన అధికారులు

కనగల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కనగల్ హైస్కూల్‌లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ. 10 లక్షలు నిధులు ప్రకటించారు. దీంతో బుధవారం అధికారుల బృందం హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంట్, టాయిలెట్స్ నిర్మాణాలను చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం

నల్లగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని 18వ వార్డు శ్రీరాంనగర్ కాలనీలో కృష్ణగీతా దంపతుల కుమారుడు నవదీప్ పతంగి ఎగరవేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై 60 శాతం శరీరం కాలిపోయి చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా బాలుడి కుటుంబ సభ్యులకు బుధవారం నల్లగొండ పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నంరాజు రూ. 10వేల అందజేశారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు దండు వెంకట్‌రామిరెడ్డి, మొదుగు ధర్మారెడ్డి, కట్ట శ్రీనివాస్‌రెడ్డి, గుండపునేని కిషన్ రావు, పులేందర్, నాగిళ్ల నరసయ్య, వెంకన్న, నాగరాజు, నవీన్, కృష్ణమాచార్య, తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
***
నల్లగొండ
3
గురువారం 23 జనవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980


నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72


జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 16.4



నిధులున్నా.. బకాయి చెల్లించరా?

● విద్యుత్ సర్వీసులపై ట్రాన్స్‌కో, మునిసిపల్ వర్గాల మధ్య అభిప్రాయభేదాలు



ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్టాంప్ డ్యూటీ నిధులను ప్రభుత్వం ఇటీవల మునిసిపాలిటీలకు మంజూరు చేసింది. ఆ నిధులతో మునిసిపల్ సాధారణ నిధి ఖాతాలు గలగలమంటున్నాయి. అయితే స్టాంప్ డ్యూటీ విడుదల సమయంలోనే విద్యుత్ బకాయిలు, కార్మికుల పీఎఫ్, జీఎస్టీ తదితర ప్రభుత్వ సంస్థల చెల్లింపులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని కమిషనర్లను మునిసిపల్ పరిపాలనా విభాగం ఆదేశించింది. మునిసిపల్ ఖాతాల్లో నిధులు జమయి సుమారు 20 రోజులకు పైగా గడుస్తున్నా మునిసిపాలిటీలు మాత్రం విద్యుత్ బిల్లులను చెల్లించకపోగా పీఎఫ్, జీఎస్టీ చెల్లింపుల మాటే మునిసిపల్ అధికారులు మరిచినట్లుగా ఉన్నట్లు ప్రచారమవుతోంది.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

ఏళ్ల తరబడి విద్యుత్ బిల్లులకోసం ఎదురు చూస్తున్న ట్రాన్స్‌కో అధికారులు బకాయి బిల్లుల వసూళ్లకోసం మునిసిపాలిటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆరు మునిసిపాలిటీలకు స్టాంప్ డ్యూటీ నిధులు రూ.48,65,88,110 కాగా విద్యుత్ బిల్లులు రూ.14,17,13,751 చెల్లించాల్సి ఉంది. జిల్లాలోని ఆరు మునిసిపాలిటీల్లో 908 విద్యుత్ కనెక్షన్లుండగా పెండింగ్ బిల్లులు రూ.14,17,13,751 ఉన్నాయి. వీటిలో వీధి దీపాల కనెక్షన్లు 546కు బకాయి బిల్లు రూ.4,16,26,266 ఉండగా, నీటి సరఫరా కనెక్షన్లు 362 ఉండగా బకాయి బిల్లులు రూ.10,00,87,485 ఉన్నాయి. అయితే విద్యుత్ మీటర్లు లేని కనెక్షన్లు మరిన్ని ఉన్నాయని ట్రాన్స్‌కో సిబ్బంది పేర్కొంటుండగా మునిసిపల్ యంత్రాంగాలు మాత్రం వినియోగంలో, గుర్తు తెలియని సర్వీసుల పేరిట విద్యుత్ బిల్లులను వసూలు చేస్తున్నారని అంటున్నారు. ఇందుకు నెలవారీ విద్యుత్ బిల్లులో భారీగా తేడాలు వస్తుండడటమే ఉదాహరణ అని అంటున్నారు.

జాయింట్ సర్వే చేద్దామని..

విద్యుత్ సర్వీసులు, కనెక్షన్లు, మీటర్లపై జాయింట్ సర్వే చేద్దామని పలుమార్లు కోరినప్పటికీ ట్రాన్స్‌కో సిబ్బంది సహకరించడం లేదని కూడా మునిసిపల్ అధికారులు అంటున్నారు. అయితే విద్యుత్ బిల్లులన్నీ సక్రమంగానే ఉన్నాయని, వినియోగం మేరకే చార్జీలు వస్తాయని ట్రాన్స్‌కో సిబ్బంది పేర్కొంటున్నారు. దీంతో ఇరు ప్రభుత్వ శాఖల మధ్య బిల్లులు, చెల్లింపులపై విభేదాలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వ అదేశాల మేరకు పెండింగ్ బిల్లులను చెల్లించాల్సిందేనని ట్రాన్స్‌కో అధికారులు స్పష్టం చేస్తున్నారు.

నిధులున్నా చెల్లింపులో ఆలస్యం

ఖజానా నిండా నిధులున్నప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లింపులో మునిసిపల్ అధికారులు ఆలస్యం చేస్తున్నారని ట్రాన్స్‌కో సిబ్బంది అంటున్నారు. నిధుల లేమి కారణంగా ఏళ్ల తరబడిగా బిల్లులను చెల్లించకున్నా ప్రజా అవసరాల దృష్ట్యా డిస్‌కనెక్షన్‌కు ప్రయత్నం చేయలేదని, కేవలం నోటీసుల వరకే పరిమితమయ్యామని ట్రాన్స్‌కో అధికారులు.. మిగతా 4వ పేజీలో..



మహాధర్నా



● షరతులతో అనుమతించిన హైకోర్టు
● ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వేడెక్కిన రాజకీయం
● విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పట్టు

నల్లగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రైతాంగ సమస్యలపై బీఆర్ఎస్ నిర్వహించతలపెట్టిన మహాధర్నాకు హైకోర్టు అనుమతించింది. ఈ నెల 28న నల్లగొండలోని గడియారం చౌరస్తాలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మహాధర్నా నిర్వహించుకోవాలని హైకోర్టు సూచించింది. ఈ మేరకు హైకోర్టు బుధవారం తీర్పునిచ్చింది. నల్లగొండలో నిర్వహించతలపెట్టిన బీఆర్ఎస్ మహాధర్నా ఇప్పటికే రెండు పర్యాయాలు వాయిదాపడింది. ఈ నెల 12న నిర్వహించాల్సిన మహాధర్నాను సంక్రాంతి పండుగ నేపథ్యంలో వాయిదా వేయగా, 21న నిర్వహించాల్సిన ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. గ్రామసభల నిర్వహణ నేపథ్యంలో బీఆర్ఎస్ ధర్నాకు రక్షణ కల్పించలేమనే కారణంతో పోలీసులు అనుమతి నిరాకరించారు. కాంగ్రెస్ నేతల ఒత్తిళ్ల మేరకే మహాధర్నాకు అనుమతివ్వడం లేదని ఆరోపించిన బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మంగళవారం బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల నడుమ మున్సిపల్ కార్యాలయం వద్ద ఘర్షణ, వాగ్వాదం, పూలకుండీలు విసురుకోవడం వంటి ఘటనలతో ఉద్రిక్తత నెలకొంది. ఈ పరిస్థితుల్లో తాజాగా హైకోర్టు అనుమతివ్వడంతో ఈ నెల 28న మహాధర్నాను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ నాయకత్వం సిద్ధమైంది.

ఉమ్మడి జిల్లాలో రాజకీయ వేడి

ఈ నెల21న నిర్వహించాల్సిన బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నడుమ పొలిటికల్ వార్ మొదలైంది. కాంగ్రెస్ నేతల ఒత్తిళ్లతోనే పోలీసులు అనుమతి నిరాకరించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అదేవిధంగా ఫ్లెక్సీలు, కటౌట్ల తొలగింపు అంశంపై ఈ నెల 21వ తేదీన మునిసిపల్ కార్యాలయం కేంద్రంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నడుమ ఘర్షణ, మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డిని, బీఆర్ఎస్ మిగతా 4వ పేజీలో..

అర్హులందరూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

● జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల ఎంపిక కోసం నిర్వహించే గ్రామ సభలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని అప్పాజిపేటీ, బుద్ధారం గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హుల పేర్లు జాబితాలో లేకుంటే ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, తిరిగి దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవరకొండ మునిసిపల్ కమిషనర్‌తో ఫోన్‌ఇన్

దేవరకొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్‌తో ఈ నెల 23న 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు మునిసిపాలిటీ పరిధిలోని వార్డుల ప్రజలంతా తమ సమస్యలను మునిసిపల్ కమిషనర్ సెల్: 9618455155కు తెలపాలని, సమస్యలకు కమిషనర్ సమాధానంతోపాటు పరిష్కారం చూపుతారు.

ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ఆర్టిజన్ల జేఏసీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సలీం పాషా అన్నారు. నల్లగొండ పట్టణంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద టీవీఏసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఆర్టిజన్ల రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కన్వర్షన్ చేస్తామని చెప్పి కాలయాపన చేసిందన్నారు. ఈ ప్రభుత్వం కూడా అదే తీరుతో ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హత కలిగిన వారిని కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెరిక శేఖర్, రమేష్, లింగస్వామి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హుల జాబితాపై అపోహలొద్దు

● అది దరఖాస్తుదారుల జాబితా మాత్రమే ● అదే తుది మంజూరు లబ్ధిదారుల జాబితా కాదు
● జాబితాలో అనర్హులుంటే తొలగిస్తాం ● రాని వారు దరఖాసు చేసుకోవచ్చు ● కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎమ్మెల్యే వేముల వీరేశం



నార్కట్‌పల్లిలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, చిత్రంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు, ఇందిరమ్మఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతు భరోసాలైన నాలుగు సంక్షేమ పథకాల్లో అర్హుల గుర్తింపుకోసం విడుదలైన జాబితాపై అపోహలొద్దని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. అది వివిధ మార్గాల ద్వారా సంక్షేమ పథకాలు కోరుతూ చేసుకున్న దరఖాస్తుదారుల జాబితా మాత్రమేనని ప్రకటించారు. ఆ జాబితాలో కూడా ఎవరైనా అనర్హులుంటే వారిని తొలగిస్తామని చెప్పారు. నార్కట్‌పల్లి గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నిన్న 237గ్రామసభలు, 48 వార్డుసభలు జరిగాయన్నారు. గ్రామసభల ద్వారా సమాచారం సేకరించి అర్హుల తుది జాబితా తయారు చేస్తామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామన్నారు. రేషన్‌కార్డులతోపాటు ఇతర మూడు సంక్షేమ పథకాల కోసం సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న దానిని నమ్మవద్దన్నారు. అధికారికంగా ఇప్పటివరకు జాబితాలోని ఏ ఒక్కరికీ రేషన్‌కార్డు కాని, ఇతర సంక్షేమ పథకాలు కాని ఇవ్వలేదన్నారు. రేషన్‌కార్డు దరఖాస్తు నిరంతర ప్రక్రియన్నారు. ఎపుడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల మంజూరులో మహిళలకు పెద్దపీటవేయడంపై ఓ మహిళగా తనకు ఆనందానిచ్చిందన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం..ప్రజా పాలనలో పేదలకు అన్యాయం జరగదన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వచ్చేలా చేసే బాధ్యత తనదన్నారు. ప్రభుత్వం విడతల వారిగా అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే.ఉమేశ్ చారి, మార్కెట్ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, సీపీఐ నాయకుడు లొడంగి శ్రవణ్‌కుమార్, దూదిమెట్ల సత్తయ్య, స్రవంతి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, సట్టు సత్తయ్య, జెరిపోతుల భరత్, పుల్లెంల అచ్చాలు, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రెండోరోజు ఇలా...		
గ్రామసభలు	:	221
వార్డుసభలు	:	47
దరఖాస్తులు ఇలా...		
ఆత్మీయ భరోసా	:	446
రేషన్‌కార్డు	:	13,921
ఇందిరమ్మ ఇళ్లు	:	12,227

లబ్ధిదారుల జాబితా ఖరారు కాలేదు

చిట్యాల: రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం గ్రామ, వార్డుసభలలో చదువుతున్న పేర్లు కేవలం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లేనని కలెక్టర్ ఇలాత్రిపాఠి తెలిపారు. చిట్యాల 5వ వార్డులో జరిగిన వార్డు సభలో ఆమె ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ, వార్డు సభల్లో చదివే పేర్లలో పేరు లేకపోతే తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కమిషనర్ వీరేందర్, మండల ప్రత్యేకాధికారి శ్రవణ్, కౌన్సిలర్లు జడల పూలమ్మ చినమల్లయ్య, బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, పాటి మాధవరెడ్డి, ఎద్దులపురి కృష్ణ, గుండెబోయిన సైదులు పాల్గొన్నారు.

బోగస్ జాబితాలను నమ్మవద్దు: కలెక్టర్

నల్లగొండ: ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా వంటి పథకాలపై అనుమతి పొందిన లబ్ధిదారుల జాబితాల పేరుతో సామాజిక మాధ్యమాలు, గ్రామాల్లో విడుదల చేస్తున్న బోగస్ జాబితాలను ఎవ్వరు నమ్మవద్దని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. ప్రభుత్వం తరఫున ఇప్పటివరకు ఎలాంటి అనుమతి పొందిన జాబితాలను విడుదల చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ, వార్డు సభల్లో ఆయా పథకాల కింద ఇంతకు ముందు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను మాత్రమే చదువుతున్నారని చెప్పారు. ప్రజలు ఎవ్వరుకూడా ప్రచారాలు నమ్మవద్దన్నారు.

రాజకీయాలకతీతంగా యాదగిరిగుట్ట ఆలయాన్ని

అభివృద్ధి చేయాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

భువనగిరి అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి జరగాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి స్వాతి నక్షత్రం రోజున జరిగిన గిరిప్రదక్షిణలో ఆమె పాల్గొని మాట్లాడారు. పంచారూపాల్లో పూజలు అందుకుంటున్న స్వామివారిని దర్శించుకోవడం జన్మజన్మల పుణ్యఫలమన్నారు. ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలికి వేదాశీర్వచనం చేయగా ఆలయ ఈవో భాస్కర్ రావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతి నెల జరిగే గిరిప్రదక్షిణలో పాల్గొనడం అదృష్టమన్నారు. ఈ దివ్య క్షేత్రంలో పంచనారసింహుడి రూపాల్లో స్వామివారిని భక్తులు ఆరాదించడం ఎంతో విశేషమన్నారు. ఇంత భారీ ఆలయాన్ని నిర్మించేందుకు కేసీఆర్‌కు సంకల్ప శక్తిని ప్రసాదించడం తెలంగాణ ప్రజల అదృష్టమన్నారు. తెలంగాణలో ఏకైక గిరిప్రదక్షిణ చేసే అవకాశం ఉన్న క్షేత్రమని, గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు మెట్ల దారి వెంట నడిచి వెళ్లి ఆలయంలోని స్వామిఅమ్మవార్లను దర్శించుకోవాలన్నారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కొంపెల్లి పెద్ద చెరువు మరమ్మతుకు చర్యలు


● చెరువును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

మునుగోడు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి గ్రామంలో పెద్ద చెరువు మరమ్మతుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కొన్ని సంవత్సరాల నుంచి పైన ఉన్న గ్రామాలనుంచి నీళ్లు రాకపోవడంతో, కొంపల్లి ప్రజలు పడుతున్న ఇబ్బందిని రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వెదిరే విజేందర్‌రెడ్డి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను కొంపల్లి చెరువు క్షేత్రస్థాయి పర్యటనకు పంపారు. వెదిరే విజేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈఈలు సంపత్‌రెడ్డి, గోపి, లష్కర్, అంజయ్యల సమక్షంలో పుట్టపాక నుంచి కొంపల్లి వరకు ఫీడర్ కాల్వ పూడిక తీయడం, కాల్వ మీద కల్వర్టుల నిర్మాణం, చెరువు పూడిక తీయడం, చెరువులో ఉన్న కంపచెట్లను తొలగించడం గురించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు సూర శంకరయ్య, జీడిమండ్ల మల్లయ్య, సంకు శంకర్, బొల్లేపల్లి సాయిలు, నాంపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

● భూపాల్‌రెడ్డి ఇప్పటికైనా భాష మార్చుకోవాలి
● కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, చిత్రంలో బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

4

ధర్నా అంటే ఉలిక్కిపడుతున్న మంత్రులు

● కాంగ్రెస్ తీరును ప్రజలు గమనిస్తున్నారు ● ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోతోంది
● నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సారూ.. మా పేర్లు ఎందుకు లేవు?

● గ్రామ సభల్లో అధికారులను ప్రశ్నించిన ప్రజలు ● అనర్హులకే పథకాలు దక్కుతున్నాయంటూ ఆవేదన



గుడిపల్లిలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న లబ్ధిదారులు



నిడమనూరు గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి22(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల జాబితాలో మా పేరు ఎందుకు లేదంటూ పెద్దఅడిశర్లపల్లి మండలం అజ్మపురం, గుడిపల్లి గ్రామాల్లో బుధవారం జరిగిన గ్రామసభలో అధికారులను ప్రశ్నించారు. రెండో రోజు ఉమ్మడి మండలంలో గుడిపల్లి, అజ్మపురం, ఎర్రగుంటతండా, మునా వత్‌తండా, రాంపురం, దుగ్యాల, కేశంనేనిపల్లి, చింతల్‌తండా గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు పంచాయతీ కార్యదర్శి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా అయా గ్రామ పంచాయతీలో రైతు భరోసాకు తొలగించిన భూముల వివ రాలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పథకాల అమలుకు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబి తాను అయా అధికారులు చదివి వినిపించారు. దీంతో అనర్హులను ప్రకటించారంటూ అజ్మపురం, గుడిపల్లి గ్రామసభలో రసాభాసగా జరిగింది. లబ్ధిదారులు అధికారుల స్టేజీ వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య తోపులాట జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి లబ్ధిదారులతో మాట్లాడి సర్దిచెప్పారు. గంట పాటు నిలిచిపోయిన గ్రామసభ తిరిగి ప్రారంభించిన అధికారులు జాబితాలో పేర్లు లేని వారి దరఖాస్తులను స్వీకరించారు. అయా గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి నాగమల్లేశ్వర్‌రావు, ఎంపీడీవో చంద్రమౌళి, తాసీల్దార్లు మధుహాసిని, శ్రీనివాస్‌రావు, ఎంఈవో వెంకటయ్య, శ్రీనయ్య, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారులను నిలదీత

దేవరకొండ,(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంతో పాటు గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. దేవరకొండ 6 నుంచి 10వ వార్డు వరకు మండలంలో 10 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. దేవరకొండ మండలం అంబటోనిగూడెంలో గ్రామస్థులు, బీఆర్‌ఎస్ నాయకులు అన్ని అర్హతలు ఉన్నప్పటికి జాబితాలో పేర్లు ఎందుకు లేవని అధి కారులను నిలదీశారు. కొద్దిసేపు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో పోలీసులు, అధికారులు వారికి మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని నచ్చ చెప్పారు. దేవరకొండ 10వ వార్డు లో మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ పాల్గొ న్నారు. రేషన్‌కార్డులకు, ఇందిరమ్మ ఇళ్లకు మళ్లీ దరఖా స్తులు చేసుకుంటే ఎప్పుడు మంజూరు అవుతాయని అధికారులను ప్రశ్నించారు. అర్హులైన వారందరికి పథకాలు అందుతాయని అధికారులు తెలిపారు.

జాబితాలో అర్హుల పేర్లు లేవంటూ ఆగ్రహం

నిడమనూరు(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలుకు లబ్ధిదారుల ఎంపిక కోసం బుధవారం నిడమనూరు మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభ గందరగోళంగా మారింది. లబ్ధిదారుల జాబితా తప్పుల తడకగా ఉందని, జాబితాలో అర్హుల పేర్లు లేవని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీశారు. స్థానిక రైతువేదికలో జరిగిన గ్రామసభకు గ్రామస్థులు దరఖాస్తులతో భారీగా వచ్చారు. గ్రామసభలో అధికారులు జాబితాలో లబ్ధిదారుల పేర్లు చదివి వినిపిస్తుండగా ప్రజలు ఒక్కసారిగా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయంటూ నిలదీశారు. ఏళ్ల తరబడిగా తమకు రేషన్‌కార్డులు లేవంటూ వాపోయారు. అధికారులు మాట్లాడుతూ జాబితాలో పేర్లు లేనంతమాత్రాన ఎవరూ నిరాశ చెందవద్దని, సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలంటూ సూచించారు. గందరగోళం ఏర్పడటంతో గ్రామసభను ముగించారు. ఆయా గ్రామసభలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో గుర్రం వెంకటేశం, ఏవో మునికృష్ణయ్య, ఏఈ పీఆర్ సాయిప్రసాద్, ఎంఈవో లావూరి వెంకన్న, ఏపీఎం లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకన్న, ఆర్‌ఐ దాడి రాజిరెడ్డి, ఏఈవో విజయచంద్ర పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు మధ్య వాగ్వాదం

వేములపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపల్లి, లక్ష్మీదేవిగూడెం, మంగాపురం గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు పాల్గొని మాట్లాడారు. వేములపల్లిలో జాబితా అస్తవ్యస్తంగా ఉందని బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రశ్నించడంతో కొద్దిసేపు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసు టకుంది. వెంటనే ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వారికి సర్దిచె ప్పడంతో సభ సాఫీగా సాగింది. కార్యక్రమంలో తహసీ ల్దార్ పుష్పలత, ఎంపీడీవో శారదాదేవి, పీఆర్ ఏఈ బిందు, ఎంపీవో లలిత, ఎంఏవో కిశోర్‌నాయక్, కార్యదర్శి శ్రవణ్‌కుమార్, ఏఈవోలు నితీన్, మల్సూర్, రమేష్, ఏఎస్‌వో రేఖా, నాయకులు మాలి కాంతారెడ్డి, కృపయ్య, రావు ఎల్లారెడ్డి, షట్టల శ్రీను పాల్గొన్నారు.

● చింతపల్లి,(ఆంధ్రజ్యోతి): నెల్వల పల్లి, రాయిని గూడెం, ధైర్యాపురితండా, దేన్యాతండా, జర్పులతండా, బోత్యాతండా, వర్కాల, ఉమ్మాపురం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జాబితాలో పేర్లు నమోదు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ రమాకాంత్‌శర్మ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



దామరచర్ల: వాడపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

గుర్రంపోడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు అన్నారు బుధవారం మండలంలోని చింతగూడెం, తేనెపల్లి,యల్లమోనిగూడెం, కాల్వపల్లి, తెరాటిగూడెం, పిట్టలగూడెం, గాసి రాం తండా, ఉట్లపల్లి, కొప్పోలు, బుడ్డారెడ్డిగూడెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. తేనెపల్లి, పిట్టలగూడెం, కొప్పోలు గ్రామసభల్లో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు కార్యక్రమంలో ఎంపీడీవో మంజుల, డిప్యూటీ తహసీల్దార్ ఫరీద్, ఎంపీవో పద్మ, పీఆర్‌ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● హాలియా, (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 2, 6, 10వ వార్డుల్లో సభలను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను, అభిప్రాయాలను వ్యక్తపరిచారు.అనుముల మండలంలోని పులిమామిడి, రామడుగు, శ్రీనాథపురం, పాలెం, చింతగూడెం, మారేపల్లి, యాచారం గ్రామాల్లో కూడా గ్రామ సభలను నిర్వహించారు. కార్యక్రమాల్లో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి కౌన్సిలర్లు చింతల చంద్రారెడ్డి, రాజారమేష్‌యాదవ్, పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13 నుంచి 24వ వార్డుల్లో సభలు నిర్వహించారు. కాగా పలు వార్డుల్లో ప్రజలు సభలకు హాజరైన అధికారులను నిలదీశారు. కార్యక్రమాల్లో మునిసిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ బీజేపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ చిలుకూరి రమాశ్యాం పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి (ఆంధ్రజ్యోతి):మండలంలోని ధర్మాపురం, చెరుపల్లి, మాడ్గులపల్లి, దాచారం, పూసలపాడు, గజలాపురం, కొత్తగూడెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వమించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమలస్వామి, తహ సీల్దార్ సురేష్, ఎంపీవో సంగీత పాల్గొన్నారు.

●దామరచర్ల : మండలం వాడపల్లిలో పాటు పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహి ంచారు. వాడపల్లి గ్రామ సభలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా పార్టీ శ్రేణులు కృషిచేయాలన్నారు.

● కొండమల్లేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్ధమానిగూడెం, గాజినగర్ గ్రామ సభలో అనర్హులను ఎంపిక చేసి అర్హులను ఎంపిక చేయలేదని పలువురు ఆరోపించారు. బుధవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 77, రేషన్ కార్డుల కొరకు 139, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 32 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపిడివో బాలరాజురెడ్డి తెలిపారు.

అసంపూర్తిగా గ్రామ సభలు : బీఆర్‌ఎస్

వేములపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అర్హుల జాబితా నిర్ధారణకు గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలు అధికారులు అసంపూర్తిగా ముగిస్తున్నారని బీఆర్ ఎస్ నాయకులు చిర్ర మల్లయ్యయాదవ్ విమర్శించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రదర్శిస్తున్న జాబితాను అధికారులు ఏ ప్రాతిపదికన తయారు చేశారో తెలుపకపోవడం బాధాకరమన్నారు. గ్రామ సభలో లబ్ధిదారుల జాబితా ఇంకా తయారు కాలేదని చెప్పి కేవలం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను మాత్రమే చదివి వినిపించడంతో ప్రజలు అందోళనకు గురవుతున్నారని అన్నారు. అలా కాకుండా నిజమైన లబ్ధిదారుల జాబితాను తయారు చేసి బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సమవేశంలో పుట్టల పౌల్, మునీశ్వర్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

పెద్దఅడిశర్లపల్లి,జనవరి22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దుగ్యాల తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో 100 సీట్లు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ నకిరేకంటి శ్రీనయ్య బుదవారం తెలిపారు. సీట్ల భర్తీకి సీట్లకు నోటిఫికేషన్ వచ్చిందని, వచ్చే నెల ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఓసీ విద్యార్థులకు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మండల విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనయ్య అన్నారు.

రేపు విద్యుత్ సదస్సు

కొండమల్లేపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికై ఈనెల 24న జిల్లా కేంద్రం లోని ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ వెంక టేశ్వర్లు సమక్షంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నాం 2 గంటల వరకు నిర్వహిస్తున్న వినియోగదారుల ఫోరాన్ని విద్యుత్ వినియోగ దారులు సద్వినియోగం చేసుకోవాలని డీఈ విద్యాసాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విధిగా తమ వెంట ఆధార్ కార్డ్, కరెంటు బిల్లు పత్రాలను తెచ్చుకోవాలని డీఈ తెలిపారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి

పెద్దఅడిశర్లపల్లి,జనవరి22(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో జనవరి 25-28 వరకు నిర్వహిస్తున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ కోరారు. మండలంలోని అజ్మాపురం గ్రామంలో బుధవారం మహాసభల పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య, కంబాలపల్లి చిరంజీవి, చంద్రయ్య, కవిత తది తరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'వర్తింపజేయాలి

గుర్రంపోడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీల్లో బాగంగా ప్రకటించిన భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీ య భరోసా లబ్ధిదారుల ఎంపికలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉండి 20 రోజుల పని చేసిన వారికే అనే నియమాన్ని తొల గించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని బీజేపీ కొప్పోలు శాఖ ఆధ్వర్యంలో గుర్రంపోడు మండల స్పెషల్ ఆఫీ సర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అంద జేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మామిడి వినోద్, యువ మోర్చా మండల అధ్యక్షుడు తూటిపల్లి రామకృష్ణ, బొంగరాల ప్రశాంత్, తేలుకుంట్ల రవికుమార్, పోలోజు సతీష్‌చారి, రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

చింతపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన గొబ్బూరు శ్రీదేవి కుమార్తె రచన శ్రీ గౌతమి(అమెరికా) రూ25 000 వాటర్ ఫిల్టర్, రూ. 20, 000 లేసర్ ప్రింటర్‌ను ప్రాథమిక పాఠశాలకు బుధవారం అంద జేశారు.ఈ సందర్భంగా గొబ్బూరు వెంకటేశ్వరరావుమాట్లాడుతూ...పాఠశాల అభివృద్ధికి మా కుటుంబ సభ్యుల సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఆధ్యాపకులు, కో-ఆప్షన్ సభ్యులు పొతగోని రామస్వామి గౌడ్, ముద్దం రవీందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ టెక్నాలజీతో పోగొట్టుకున్న మొబైల్ గుర్తింపు

మాడ్గులపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పొగొట్టుకున్న మొబైల్‌ను మాడ్గులపల్లి పోలీసులు ట్రేస్ చేసి బాధితులకు అందచేశారు. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన మొగుళ్ల ధనమ్మ, కొయ్యగూడేనికి చెందిన వడ్డె సందీప్, ఆగామోత్కూర్‌కు చెందిన గంజి జితేందర్‌లు తమ మొబైల్స్‌ను మం డల పరిధిలో పొగొట్టుకున్నారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ ఉన్న చోటును గుర్తించి బాధితుడికి బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పొగొట్టుకున్న మొబైల్‌ను గుర్తించి బాధితులకు అందచేయడం జరుగుతుందన్నారు.

చందంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



చందంపేట: గుంటిపల్లిలో గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): చందంపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని గుంటిపల్లి, గన్నేర్లపల్లి, హంక్య తండా, మురుపునూతల, దేవరచర్ల, యలమలమందలో బుధ వారం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామానికి, ప్రతితండాకు సీసీ రోడ్లను నిర్మిస్తామని, రానున్న ఐదేళ్లలో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం గుంటిపల్లిలోని గ్రామసభలో పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరు ఇందిరమ్మ ఇళ్లు, రైతు ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి అర్హులను ఎంపిక చేస్తారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొండ శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బద్యానాయక్, ఎంఈవో చందర్‌నాయక్, సాధిక్ పాల్గొన్నారు.

పార్క్‌లో విగ్రహం ఏర్పాటుపై నోటీసు



విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ యూసుఫ్, డీఈ వెంకన్న

మిర్యాలగూడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా పార్క్‌లో విగ్రహం ఏర్పాటుపై మునిసిపల్ కమిషనర్ బుధవారం నోటీసు జారీ చేశారు. మం డల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న ఖాళీ స్థలంలో సుమారు 20 22లో పరిషత్ పాలకవర్గం అను మతి లేకుండా మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ తండ్రి గంగాధర్ పేరున స్మారక పార్క్‌ను ఏర్పాటు చేశారు. మునిసిపల్ నిధులు వెచ్చించి సుమారు 6 గుంటల స్థలంలో నిర్మించిన పార్క్‌లో ప్లే గ్రౌండ్‌తో పాటు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. 2023 మార్చి 10న నాటి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు ప్రారం భించారు. కాగా పార్క్‌లో రెండు రోజుల క్రితం అనుమతులు లేకుండా తిరునగరు గంగాధర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేశారు. పార్క్ మధ్యలో దిమ్మె ఏర్పాటు చేసి ముసుగు వేసి ఉన్న విగ్రహాన్ని దానిపై ప్రతిష్టించారు. విష యం తెలుసుకున్న కమిషనర్ ఎండీ యూసూఫ్, డీఈ వెంకన్న, టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమయ్య, అంజయ్యతో కలిసి పార్క్‌ను సందర్శించి ముసుగు విగ్రహానికి నోటీసులు అంటించారు. రెండు రోజుల్లో సదరు విగ్రహ ఏర్పాటు నిర్వాహకులు స్పందించకపోతే కూల్చి వేస్తామని నోటీసులో పేర్కొన్నారు. అను మతులు తీసు కోకుండా విగ్రహాలు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమని, ఏర్పాటు చేస్తున్న వారు ఎవరో తెలియనందున విగ్రహానికి నోటీసు అంటిం చినట్లు కమిషనర్ యూసూఫ్ తెలి పారు. మునిసిపల్ చైర్మన్ తండ్రి విగ్రహానికి కమిషనర్ షోకాజ్ నోటీసు ఇవ్వడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

బడీడు పిల్లలు బడిలో ఉండేలా చర్యలు



ఇటుక బట్టీల పిల్లలను పాఠశాలలో చేర్పించి మాట్లాడుతున్న ఎంఈవో

దామరచర్ల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండే వి. దంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో బాలాజీనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని నూనావత్‌తండా గ్రామంలో ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న కూలీల పిల్లలు ఆరుగురిని గుర్తించి సమీప ప్రాథమిక పాఠశాలలో పేరు నమోదు చేయించడం జరిగిందన్నారు. ఇటుక బట్టీ యజమాని సుధీర్ నాయక్ సహకారంతో విద్యార్థులు నోట్ పుస్తకాలు, పెన్నులు, బ్యాగ్స్, బట్టలు అందిం చామన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు పరిపూర్ణాచారి, సీఆర్‌పీ పాండు తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గుర్రంపోడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపారు. మండలంలోని కొప్పోలు గ్రామంలో పోల వెంకన్న రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తు న్నాడన్న సమాచారం మేరకు బుధవారం రాత్రి దాడి చేసినట్లు పట్టుకున్నట్లు తెలి పారు. వెంకన్నపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పట్టుకున్న రేషన్ బియ్యంతో ఎస్‌ఐ మధు

బ్రాహ్మణ సంక్షేమానికి నిధులు కేటాయించాలి



బ్రాహ్మణ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రవిప్రసాద్‌శర్మ

డిండి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయిం చాలని బ్రాహ్మణ సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కుర్మేటి రవి ప్రసాద్‌శర్మ, కన్వీనర్ వైద్యుల కృష్ణమూర్తిశర్మ కోరారు. మండలంలోని గోనబోయినపల్లి గ్రామంలో బుధవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బ్రాహ్మణులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. విదేశీ చదువుకోసం బ్రాహ్మణ విద్యా ర్థులకు ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. రాబో వు విశ్వావసు నామ పంచాంగం ఆవిష్కరణ ముద్రణపై చర్చించినట్లు వారు తెలిపారు సమావేశంలో సురభి రఘుచరణ్‌శర్మ, కుర్మేటి భిక్షపతిశర్మ, పాల సదాశివశర్మ, భాస్కరశర్మ, గణేష్‌శర్మ, చంద్రశేఖరశర్మ, సురభి ప్రభాకర్ శర్మ, గాదె కిషోర్, సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా గట్టు పీర్ల దర్గా ఉర్సు



పోలేపల్లిరాంనగర్‌లోని గట్టుపీర్ల దగ్గర ప్రార్థనలు చేస్తున్న నిర్వాహకులు

చింతపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లిరాంనగర్ గ్రామశివారులోని గట్టుపీర్ల దర్గా ఉర్సు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకుడు పడకంటి జంగయ్య ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుపుతున్నారు. హిందు మస్లిం అనే తేడా లేకుండా దర్గా వద్దకు చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు పగడాల కనకయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ముత్తు ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు కార్యక్రమంలో నిరంజన్, ఎండీ ఇద్రీస్, మొగిలి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



డైరీ, క్యాలెండర్ విడుదల చేస్తున్న సరోత్తంరెడ్డి , ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డి అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన టీపీయూఎస్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే టీచర్లకు సమస్యలు రాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సంఘ డైరీ, క్యాలెండర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పెంటయ్య, పాపిరెడ్డి, రాములు, భాస్కర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి

దేవరకొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమ యంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయా లని బీఆర్‌ఎస్ జిల్లా నాయ కుడు గాజుల ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి దేవరకొండ ఖిల్లాలోని పార్కును సందర్శించి మా ట్లాడారు. దేవరకొండ ఖిల్లా లోని రూ.5 కోట్లతో నిర్మిం చిన పార్కు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తం ఐందన్నారు. 2021లో అప్ప టి ఎమ్మెల్యే రవీంద్రకుమార్, మంత్రి కేటీఆర్ పార్కు నిర్మాణానికి నిధులు కేటాయించి పనులను పూర్తయ్యేలా కృషి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయడం లేదన్నారు. అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు సత్యనారాయణ, యేసోబు, జానిబాబా, కృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

మర్రిగూడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను రూపుమాపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద అన్నారు. బేటీ బచావో బేటి పడావో కార్యక్రమం సందర్భంగా బుధవారం దామెర భీమన పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ప్రభుత్వం ఉచితంగా విద్యను అందిస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలని ప్రధా నోపాధ్యాయులు సంజీవరావు అన్నారు. ఏఎన్ఎం సరిత, అంగన్‌వాడీ టీచర్ మరియమ్మ, పాఠశాల సిబ్బంది పలువురు ఉన్నారు.

నేడు ఓపెన్ ఫోరం

శాలిగౌరారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయ ఆవర ణలో గురువారం ఉదయం 10గంట లకు 14వ విడత ఉపాధి హామీ పథకం ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బానోతు సుధాకర్ తెలిపారు. అధికారులు సమాచారంతో సకాలంలో హాజరు కావాలని కోరారు.